PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 30 | విజయవాడ, బుధవారం 30 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 30 August 2023 | Rs

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరం ఢిల్లీ

- దక్షిణాసియాలో అతి పెద్ద ముప్పు వాయు కాలుష్యమే
- ఎనర్జీ పాలసీ ఇనిస్టిట్యూట్ నివేదిక

● లోపలి పేజీలో.. ●

ఆసియాకప్ క్రికెట్ సంగ్రామం నేటినుంచే..



- పాక్-నేపాల్ మ్యాచ్‌తో ప్రారంభం
- మధ్యాహ్నం 3.00గం॥ల నుంచి

● లోపలి పేజీలో.. ●

ఒపిఎస్ ప్రసక్తే లేదు

జిపిఎస్‌పై నిర్ణయం తీసుకున్నాం : మంత్రి బొత్స

సమావేశాన్ని బహిష్కరించిన ఉపాధ్యాయసంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం జిపిఎస్‌పై ఇప్పటికే నిర్ణయం తీసుకుంది... ఇక ఒపిఎస్ ప్రసక్తే లేదు' అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) అమలుకు సంబంధించి చర్చించేందుకు రాష్ట్ర మంత్రి వర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘ నేతలతో సచివాలయంలో మంగళవారం భేటీ అయ్యింది. ఈ సమావేశాన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించాయి. మిగిలిన సంఘాలతో చర్చించిన అనంతరం బొత్స మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల నేతలు కొన్ని అంశాలపై అనుమానాలు అడిగారని, వాటిని పరిశీలిస్తామని చెప్పినట్లు తెలిపారు. అయితే, ఉద్యోగ సంఘాల నాయకులు ఏమి అడిగారు? ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమిటన్న విషయాలను ఆయన దాటవేశారు.



'యూనియన్ నాయకులు చెబుతారని ఆయన అన్నారు. ఆ తరువాత ఎపి రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగి మరణిస్తే ఆ ఉద్యోగి కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరామని, ఓపిఎస్ ఉద్యోగుల మాదిరిగా అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని, ఏడాదికి రెండు సార్లు డిఆర్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఉద్యోగులకు సిపిఎస్ లేదా జిపిఎస్‌లో ఏదైనా ఎంచుకునే అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఉద్యోగులు నగదు తీసుకుంటే మిగిలిన నగదును మాత్రమే పెన్షన్‌గా ఇస్తారన్నారు. ఎపి ఎన్‌జిఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ ఓపిఎస్ కావాలని మరో సారి అడిగామని, 10 శాతం కాంట్రిబ్యూషన్ లేకుండా ఇవ్వాలని కోరామన్నారు. మరోసారి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరుపుతామని ప్రభుత్వం చెప్పిందన్నారు . ఎపి సెక్రటరియేట్ ఉద్యోగుల సంఘం సిపిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాల్సిందేనన్నారు. సిఎం హామీని మాటను వేరే రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని, నగదుకు సంబందించిన అన్ని విషయాలు ఆర్డినెన్స్‌లో లేవని వాటన్నింటిని పొందుపరచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. ఆర్డినెన్స్ అర్ధరహితంగా ఉందన్నారు.

పాత పెన్షన్ విధానం తప్ప మరో పెన్షన్ విధానం వద్దని అందుకోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనంటూ అంటూ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఈ భేటీని బహిష్కరించింది. ఇదే అంశంపై ఈనెల 24న జరిగిన సమావేశాన్ని కూడా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ బహిష్కరించిన సంగతి తెలిసిందే. గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ విధి విధానాలు ఏమిటో డ్రాఫ్ట్ విడుదల చేయకుండా , అందులో ఏముందో ఉద్యోగ సంఘాలకు చెప్పకుండా ఏకపక్షంగా ప్రభుత్వం అమలుకు పూనుకోవడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2004కు ముందు నియామకపు ప్రక్రియ పూర్తయిన 11వేలమందికి పాత పెన్షన్ విధానం అమలు చేయకపోవడం దురదృష్టకరమని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిపిఎస్ ఉద్యోగులు 3లక్షల మంది పాత పెన్షన్ విధానాన్నే కోరుకుంటున్నారని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. సమావేశాన్ని బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాల్లో యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్, ఆప్టా ఉన్నాయి.

ఎన్నికల వేళ గ్యాస్ ధర తగ్గింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం శాసనసభలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వంట గ్యాస్ ధరను సిలిండర్‌పై 200రూపాయలు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొంత కాలంగా గ్యాస్ సిలిండర్ ధర పెరుగుతూనే ఉన్న సంగతి తెలిసిందే. ప్రజానీకం నుండి ఆందోళన వ్యక్తమైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు.



మరోవైపు కర్నాటక ఎన్నికల్లో బిజెపి ఓటమికి గ్యాస్ ధరలు కూడా ఒక కారణం. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా తాజా తగ్గింపు నిర్ణయాన్ని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రకటించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేబినెట్ సమావేశం అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసి)లో విలేకరులతో మట్లాడిన మంత్రి ఓనం, రక్షా బంధన్ కానుకగా గ్యాస్ ధరలను తగ్గించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) వినియోగదారులకూ ఈ తగ్గింపు వర్తించనుందని, ప్రస్తుత రాయితీతో కలిపి రూ.400 తగ్గింపు లభిస్తుందన్నారు.

చంద్రయాన్ - 3 విజయం పట్ల ఇస్రోను అభినందిస్తూ మంత్రవర్గ సమావేశం తీర్మానం చేసింది. పెద్ద సంఖ్యలో మహిళా శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం పట్ల హర్షం వ్యక్తం చేసింది.

నానో ఎరువు మోసం!

ఖర్చు తగ్గించుకునేందుకు మోడీ సర్కారు నకిలీ పరిష్కారం

- నిరూపణకాని ఫలితాలు
- దిగుబడి క్షీణత
- ఆహార భద్రతకు ముప్పు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న నానో యూరియా ప్రాజెక్టు పెద్ద మోసమని అంతర్జాతీయ, జాతీయ పరిశోధనల్లో నిర్ధారణవుతోంది. సంప్రదాయ యూరియాకు బదులు నానో యూరియాను రైతులు ఉపయోగించాలని, ఖర్చు తక్కువ, పంట దిగుబడులు ఎక్కువొస్తాయని మోడీ సర్కారు మీడియాలో అమిత ప్రచారం చేస్తోంది. కాగా ప్రతిష్టాత్మక కొపెన్ హగెన్ యూనివర్శిటీకి చెందిన మార్క్స్ ఫ్రాంక్, సోరెన్ హూస్టెడ్‌లు నానో యూరియాపై పరిశోధనలు చేసి అంతా అంబక్కని తేల్చారు. అశాస్త్రీయమని పత్రాలు ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రముఖ వెబ్ మీడియా సంస్థ 'ది వైర్' తెలిపింది. నానో యూరియాకు శాస్త్రీయత లేదని, యూరియాపై సరైన పరిశోధనలు జరగలేదని, నిర్ధారణలు లేవని తాజాగా కథనాన్ని ప్రచురించింది. నానో ఎరువుల వలన భవిష్యత్తులో పంటల ఉత్పత్తిలో క్షీణత నెలకొని ప్రజల ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొంది. నానో యూరియాపై మోడీ ప్రభుత్వం చేసిన ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని వారి అధ్యయనంలో తేలింది. దేశంలోనూ అటువంటి అధ్యయనాలు జరగ్గా పేలవ ఫలితాలే వెలువడ్డాయి.

ఇఫ్కో ఉత్పత్తి

సహకార రంగంలోని ఇఫ్కో సంస్థలో కేంద్ర ప్రభుత్వ వాటాలు 41 శాతం ఉన్నాయి. ఇఫ్కో సంస్థ నానో యూరియాను కనుగొన్నట్లు వెల్లడించింది. రైతులు నానో యూరియాను ఉపయోగిస్తే మొక్కలు యూరియాను త్వరగా సంగ్రహిస్తాయని, భూమిలో నత్రజని నిల్వలు పెరుగుతాయని, దిగుబడి 8 శాతం అధికంగా లభిస్తుందని, ఖర్చు తక్కువని పర్యావరణ హితమని ప్రకటించింది. సంప్రదాయ యూరియాతో పోల్చితే పంటలపై అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని తెలిపింది. సాధారణ యూరియా 45 కిలోల బస్తాకు ప్రత్యామ్నాయంగా ద్రవ రూపంలోని నానో 500 మిల్లీలీటర్ల బాటిల్‌ను స్ప్రే చేస్తే సరిపోతుందని సిఫారసు చేసింది. ఇఫ్కో సమాచారంపై ఆదారపడి నానో యూరియా ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌లో ప్రత్యేకంగా కర్మాగారాన్ని నెలకొల్పింది. ఇక్కడ నానో డిఎపిని కూడా ఉత్పత్తి చేస్తోంది. దేశీయంగా నానో ఎరువుల ఉత్పత్తి కారణంగా ఎరువుల దిగుమతులపై ప్రభుత్వం చేసే ఖర్చు తగ్గుతుందని ఆశించారు. ఏడాదికి ఎరువుల దిగుమతులకు రూ.15 వేల నుంచి 20 వేల కోట్ల వ్యయం తగ్గుతుందని అంచనా వేశారు. ఈ ఊపులో 2025 నుంచి విదేశాల నుంచి ఎరువుల దిగుమతులు ఆపేస్తామని మోడీ ప్రభుత్వం చెప్పింది. బలవంతంగా రైతులకు నానో యూరియాను అంటగట్టే ప్రయత్నం చేసింది. సాధారణ యూరియా కేటాయింపులను తగ్గించి ప్రత్యామ్నాయం అంటూ నానో ఎరువులను పంపింది. దాంతో గుజరాత్ రాష్ట్రం కచ్ ప్రాంత రైతుల ఈ ఆగస్టు 15న పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు.

జీవవైవిధ్యం ప్రశ్నార్థకం

కాగా నానో ఎరువుల పనితనం ఇఫ్కో చెప్పినట్లు లేదని అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో పాటు దేశీయ శాస్త్రవేత్తలు సైతం ఢంకా భజాయించి చెపుతున్నారు. నానో ఎరువుల వాడకం వలన మొక్కలకు కావాల్సిన పోషకాలు సమపాళ్లలో అందుతాయనికానీ, దిగుబడి పెరుగుతుందనికానీ, భూసారంలో సమతుల్యత స్థిరంగా ఉంటుందని కానీ పరిశోధల్లో నిరూపితం కాలేదు. ఒక సీజన్‌కే ఒక ప్రాంతంలోనే పరిశోధనలు జరిగాయి. అనేక సీజన్లలో అనేక ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పరిశోధనలు జరగాలి. జీవవైవిధ్యం సంగతేంటో తేల్లేదు. పైగా నానో యూరియా వలన భూమిలో నత్రజని నిల్వలు తగ్గిపోతున్నాయి. దాంతో ఇంకా ఎక్కువ యూరియా అవసరమవుతుంది. దిగుబడి పెరగడమేమో ఉత్పాదకతలో క్షీణత కనిపిస్తోంది. దీనివలన ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అనియత వాతావరణ, ఖరీదైన ఎరువులు, అధిక ఆహార ద్రవ్యోల్బణం సమస్యల నుంచి బయట పడటానికి మోడీ ప్రభుత్వం నానో పేరిట నకిలీ పరిష్కారమార్గాన్ని కనుగొంది. ఈ చర్య అసలు సమస్యల నుంచి రైతులను, ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది.



సిఎంను కలిసిన ఇఎన్‌సి చీఫ్ పెంధార్కర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈస్ట్రన్ నేవల్ కమాండ్ చీఫ్ రాజేష్ పెంధార్కర్ మంగళవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. తూర్పు సముద్ర తీరంలో భారత నావికాదళం చేపట్టిన కార్యక్రమాలను సిఎంకు వివరించారు. వచ్చే ఫిబ్రవరిలో బహుపాక్షిక నావికా విన్యాసమైన మిలన్ 2024కు విశాఖపట్నం ఆతిథ్య మివ్వనున్న నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 57 దేశాల నుండి ప్రముఖులు, నావికాదళ భాగస్వామ్యం ఉంటుందని అంచనా వేస నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఎన్‌సికి సిఎం వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందించగా, సిఎంకు విశాఖపట్నం షిప్‌మోడల్‌ను ఈఎన్‌సి బహూకరించారు. సిఎంను కలిసిన వారిలో నేవీ ఉన్నతాధికారులు కెప్టెన్ విఎస్‌సి రావు, కట్టోజు రోహిత్, కమాండర్ వై.కె.కిషోర్, లెఫ్టినెంట్ సాయికృష్ణ ఉన్నారు.

రాష్ట్రానికి పెద్ద సమస్య జగనే!

- హోదా పై తప్ప బిజెపితో విభేదాల్లేవ్
- ఇండియా బ్లాక్ ఎలా ముందుకెళ్తుందో చూడాలి
- తెలంగాణలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- ఢిల్లీలో మీడియాతో చంద్రబాబు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"రాష్ట్రానికి పెద్ద సమస్య జగనే. రాజకీయాల్లో ఆయన ఒక బచ్చా. కరుడుగట్టిన నేరస్తుడు, శాడిస్టు అంటూ టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడారు. జగన్ సొంత చిన్నాన్నని చంపి తనపై నిందలు మోపారని ఆరోపించారు. ఎంపి రఘురామ కృష్ణం రాజును సిఐడి చిత్రహింసలకు గురి చేస్తుంటే ఆ వీడియోలు చూసి శాడిస్టిక్ ఆనందం పొందారని ఆరోపించారు. మూడు రాజధానులు పేరుతో ఏపికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు.

పోలవరం నిర్మాణం ఆగిపోయిందని,జగన్ ప్రభుత్వ అవినీతి, అక్రమాల గురించి మాట్లాడితే కేసులు పెడుతున్నారని, తనపై ఎన్ని కేసులు ఉన్నాయో తెలుసుకునేందుకు ఆర్టీఐ వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. జగన్ ఏపిని సర్వ నాశనం చేశారని, దానిని ఎలా పునర్నిర్మించాలన్న ఆలోచనలో తాను ఉన్నానని అన్నారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చానని, మిగతా విషయాల్లో కేంద్రంతో ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల్లో టిడిపి ఒంటరిగానే పోటీ చేస్తుందని చంద్రబాబు వెల్లడించారు. బిజెపితో కలిసి వెళ్లడానికి సమయం మించిపోయిందని అన్నారు. బిజెపితో అంతర్గతంగా ఏం చర్చిస్తున్నామనేది మీకు తెలీదని, తాను చూడని రాజకీయం లేదని అన్నారు. దేశ నిర్మాణంలో భాగం కావాలన్నది తన ఉద్దేశమని, అది ఎలా అనేది కాలం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. 1983 నుంచే టిడిపి జాతీయ మిగతా 2లో

మాతృభాషను కాపాడుకుందాం

- విశాఖలో ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి సభ

● లోపలి పేజీలో.. ●



వేరుశనగపై 'అనంత' రైతన్న నిరాసక్తి

- ఏటా పడిపోతున్న సాగు విస్తీర్ణం
- గిట్టుబాటు కాకపోవడమే కారణం

● లోపలి పేజీలో.. ●

యువతే భవిష్యత్తు నిర్మాతలు

- నాగార్జున యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- ప్రముఖ పాత్రికేయులు సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, వైస్ ఛాన్సలర్ తదితరులు

ప్రజాశక్తి- ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

యువతే భవిష్యత్తు నిర్మాతలని రాష్ట్ర గవర్నర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కులపతి జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ 39వ, 40వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను యూనివర్సిటీ తరుపున రాష్ట్ర గవర్నర్ ప్రదానం చేశారు. విద్యార్థులకు డాక్టరేట్లు, పిహెచ్‌డి, ఎంఫిల్ పట్టాలు, బంగారు పతకాలు, డిగ్రీలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అనుసంధానం జరుగుతున్న నేటి విప్లవాత్మక పరిణామ క్రమంలో శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో యువత కృషి అమోఘమని అన్నారు. అభివృద్ధి వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు వారే మార్గదర్శకమని పేర్కొన్నారు.

పాలగుమ్మి సాయినాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప భాషా వారసత్వ చరిత్ర ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సంక్షోభం తలెత్తినప్పుడు అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం జయతీఘోష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేసిందన్నారు. తాను గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అధ్యయనం చేయడం వల్ల జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, తాను జర్నలిస్టుగా వ్యవసాయ రంగం, గ్రామీణ పరిస్థితుల గురించి ఎక్కువగా అధ్యయనం చేశానని తెలిపారు. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ వి.రాజశేఖర్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద్‌మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ సెనేట్ సభ్యులు, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా

ఎప్పుడు పునరుద్ధరిస్తారు?

- కేంద్రానికి సుప్రీం సూటి ప్రశ్న

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ఎప్పుడు పునరుద్ధరిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు మంగళవారం సూటిగా ప్రశ్నించింది. 'దేశ భద్రత ప్రధానమైన విషయం అయినప్పటికీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ మన దేశానికి అత్యంత కీలకమైన అంశం' అని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేశారు. దీనికి కేంద్రం తరపున స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మొహతా 'జమ్మూ కాశ్మీర్‌కు కేంద్ర పాలిత హోదా శాశ్వత లక్షణం కాదని అన్నారు. రాష్ట్ర హెూదా పునరుద్ధరణకు కచ్చితమైన కాల వ్యవధిని తెలియజేయాలని సుప్రీం కోర్టు పదే పదే అడగడంతో 'ఆగస్టు 31 నాటికల్లా సానుకూల ప్రకటన చేస్తాం. అయితే లడఖ్ మాత్రం కేంద్ర పాలిత ప్రాంతంగానే ఉంటుంది' అని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి చెప్పారు. 2023 సెప్టెంబర్‌లో లడఖ్‌లో ఎన్నికలు ముగుస్తాయని అన్నారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా, ఆర్టికల్ 370ను రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్లపై గత పక్షం రోజులుగా విచారణ జరుపుతున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం రాష్ట్రాన్ని నిర్దిష్టకాలానికి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడానికి పార్లమెంటుకు అధికారముందా అని ప్రశ్నించింది. సరిహద్దు రాష్ట్రాలనను కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించే అధికారం పార్లమెంటుకు ఉందా అని రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపిస్తున్న సమయంలో చీఫ్ జస్టిస్ జాతీయ భద్రత రేఖను ప్రభుత్వానికి అందించారు. 'మేము మిమ్మల్ని నిర్బంధిం చాలనుకోవడం లేదు. ఇందులో జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు ఉన్నాయని మేము అర్థం చేసుకున్నాము. అయితే జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించడంపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలి' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దీనికి లంచ్ విరామం తరువాత తుషార్ మొహతా సమాధానం ఇస్తూ ఈ నెల 31న జమ్మూకాశ్మీర్‌పై కేంద్రం సానుకూల ప్రకటన చేస్తుందని తెలిపారు. సాధారణ పరిస్థితులు తరువాత రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని మొదటి నుంచి కేంద్రం చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. 2019 ఆగస్టు5న ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్ముకాశ్మీర్‌కు మంచి రోజులువచ్చాయని మెహతా చెప్పారు.



జిందాల్‌కు కాకినాడ సెజ్!

- గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ కూడా కట్టబెట్టే అవకాశం!

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ సెజ్‌ను ప్రభుత్వం కార్పొరేటర్ సంస్థలకు అప్పగిస్తూ వస్తోంది. తొలుత జిఎంఆర్‌కు, తర్వాత అరబిందోకి ఈ భూములను అప్పగించారు. తాజాగా సజ్జన్ జిందాల్‌కు చెందిన జెఎస్‌డబ్ల్యు చేతిలో పెట్టేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. పరిశ్రమలు వస్తాయని, అభివృద్ధి జరుగుతుందని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎదురుచూస్తున్న భూ నిర్వాసితులకు ఏళ్ల తరబడి నిరాశే మిగులుతోంది. సుదీర్ఘకాలంగా సెజ్ భూములు నిరుపయోగంగా పడి ఉండడంతో అటు వ్యవసాయ ఉత్పత్తులు నష్టపోయి, ఇటు పారిశ్రామిక అవసరానికి కూడా భూములు అక్కరకు రాని పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సెజ్ భూములు రెండుసార్లు చేతులు మారింది. ఇప్పుడు మరోసారి ఈ భూములు చేతులు మారనున్నాయనేది చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే కార్పొరేట్ సంస్థలు సెజ్ భూములపై ఆసక్తి చూపుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



కాకినాడ సెజ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ 2003లో ఏర్పాటైంది. 2005 డిసెంబర్, 2006 జనవరిలో భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పేరుతో నోటిఫికేషన్ జారీ చేసింది. కాకినాడ పరిసరాల్లో ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో రిఫైనరీ ఏర్పాటుతో సహా పలు ఆయిల్ కంపెనీలు తీసుకొస్తామని ఆ సమయంలో చెప్పుకొచ్చింది. ఈ మేరకు భూసేకరణ చేపట్టింది. యు.కొత్తపల్లి మండలంలో 2,295 ఎకరాలు, తొండంగి మండలంలో 2,398 ఎకరాలు, ప్రభుత్వ భూములు కలుపుకుంటే మొత్తం 10,500 ఎకరాల పరిధిలో కాకినాడ సెజ్ విస్తరించింది. ఈ భూములను జిఎంఆర్ సంస్థకు అప్పగించింది. 2,180 ఎకరాలకు సంబంధించిన రైతులు తమ భూములను ఇవ్వడానికి వ్యతిరేకించారు. పరిహారం కూడా తీసుకోలేదు. దీంతో, ఆ భూములను సంబంధిత రైతులకు ప్రభుత్వం అప్పగించింది. మిగిలిన 8,320 ఎకరాల్లో పరిశ్రమలు రాకపోగా, 17 ఏళ్లుగా భూములన్నీ ఖాళీగా ఉన్నాయి. ఈ సెజ్‌లోని 51 శాతం వాటాను అరబిందో రియాల్టీ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు జిఎంఆర్ సంస్థ రూ.2,610 కోట్లకు రెండేళ్ల క్రితం విక్రయించేసింది. ఇప్పుడు ఈ భూములను సజ్జన్ జిందాల్‌కు చెందిన జెఎస్‌డబ్ల్యుకు విక్రయించేందుకు చర్చలు ప్రారంభమైనట్లు సమాచారం. ఇప్పటికే అరబిందో, సజ్జన్ జిందాల్ సంస్థలు ఒక అవగాహనకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి ముందు కాకినాడ సెజ్ కోసం ఎస్ఆర్ సంస్థ ప్రయత్నించింది. సజ్జన్ జిందాల్ కొన్ని నెలల క్రితం సిఎం జగన్‌తో భేటీ తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైనట్టు సమాచారం. అందులో భాగంగా కాకినాడ సెజ్‌తో పాటుగా గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ కూడా జెఎస్‌డబ్ల్యుకు అప్పగించేందుకు ఉన్నత స్థాయిలో వ్యవహారాలు సాగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏళ్లు గడుస్తున్నా కాకినాడ సెజ్‌లో ప్రస్తుతం పది ఎకరాల విస్తీర్ణంలోనైనా కార్యకలాపాలు కనిపించడం లేదు. చైనాకు చెందిన పల్స్ ఫ్లష్ అనే సంస్థ బొమ్మల తయారీ యూనిట్ కొంతకాలం నడిపి మూసివేసింది. ప్రస్తుతం మూడు ఆక్వా ప్రొడక్ట్ ప్రోసెసింగ్ యూనిట్లు మాత్రమే నడుస్తున్నాయి. రూ.1000 కోట్లతో 600 ఎకరాల్లో బల్క్ డ్రగ్ యూనిట్‌ని అరబిందో నిర్మిస్తోంది. వచ్చే ఏడాది దీన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

ఇమ్రాన్‌కు ఊరట !

- తోషఖానా కేసులో శిక్ష రద్దు

ఇస్లామాబాద్ : పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఇస్లామాబాద్ హైకోర్టులో ఊరట లభించింది. తోషఖానా అవినీతి కేసులో ఇమ్రాన్‌కు దిగువ కోర్టు విధించిన మూడేళ్ల జైలుశిక్షను రద్దు చేస్తూ, ఆయనను బెయిలుపై విడుదల చేయాలని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన హైకోర్టు ధర్మాసనం మంగళవారం తీర్పు ఇచ్చింది. 2018-2022 మధ్య కాలంలో ఆయనకు, కుటుంబ సభ్యులకు లభించిన ప్రభుత్వ బహుమతులను దాచి పెట్టి, అమ్ముకున్నారన్న ఆరోపణపై దిగువ కోర్టు ఆయనను దోషిగా నిర్ధారించి, మూడేళ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఇమ్రాన్ పదే పదే తిరస్కరిస్తున్నందున శిక్షను రద్దు చేస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఖాన్‌ఈ కేసులో బెయిలుపై బయట పడినా, డజన్ల కొద్దీ ఇతర ఆరోపణలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకే మళ్లీ అరెస్టు కాకుండా బ్లాంకెట్ బెయిలు కోసం ఖాన్ బృందం ఒక పిటిషన్ వేసింది. ఇమ్రాన్‌పై శిక్ష మాత్రమే రద్దయింది, అసలు నేరారోపణ కాదు, కాబట్టి అయిదేళ్లపాటు ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనకుండా ఆయనపై ఉన్న నిషేధం అలాగే ఉంటుందని న్యాయవాది మీర్జ మోయిజ్ బేగ్ అన్నారు. ఇస్లామాబాద్ హైకోర్టు తీర్పును పిటిఐ స్వాగతించగా, మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షను ప్రస్తుతానికి రద్దు మాత్రమే చేశారని, పూర్తిగా కొట్టివేయలేదని వ్యాఖ్యానించారు.

మాతృభాషను కాపాడుకుందాం

- విశాఖలో ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి సభ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి నాడు పాటుపడ్డట్టు, నేడు ప్రతి ఒక్కరూ కంకణధారులై మాతృభాష మనుగడకు నడుం బిగించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి 160వ జయంతి వేడుకలు సాహితీ స్రవంతి, అరసం, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్తాధ్వర్యంలో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగాయి. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవిఎస్.శర్మ అధ్యక్షతన మేడా మస్తాన్‌రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ సభలో ప్రముఖ తెలుగు భాషా కోవిదులు మీగడ రామలింగస్వామి మాట్లాడుతూ అన్య పదజాలం మనభాషలో విరివిగా ప్రవేశించినప్పుడు భాష మృతభాషగా మారుతుందని, అప్పుడు మన సంస్కృతి ఆనవాళ్లను కూడా కోల్పోతామని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తెలుగు భాష కోసం పరితపించాలని కోరారు. అవధాన ప్రక్రియ మనకే సొంతమని, అటువంటి తెలుగు సాహిత్య ప్రక్రియలకు ఆధునికతను మేళవించి భాషను రక్తి కట్టించాలని అన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గిడుగు, గురజాడ తెలుగు భాషను ఉన్నత స్థానానికి తీసుకెళ్లారని వివరించారు. తరతరాలుగా తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా తెలుగు భాష నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు, నగర ప్రముఖులు కెజి.వేణు, అడపా రామకృష్ణ, క్షేత్రపాల్ రెడ్డి, వేల్పూరి నాగు, కెఎస్‌వి.రమణమ్మ, శేఖరమంత్రి ప్రభాకర్, పి.శ్యాంసుందర్, డాక్టర్ కెవిఎస్.మూర్తి, డాక్టర్ ఎం.సుబ్బారావు, జాలాది విజయ, వేణు, అప్పలరాజు, వై.దయానంద్, పి.నల్లనయ్య, అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి పెంటకోట రామారావు, అరసం బాధ్యులు ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు. మస్తాన్ రెడ్డి బృందం ప్రదర్శించిన నాటకం అందరినీ ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న మీగడ రామలింగస్వామి

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రపంచంలో ఉన్న తెలుగువారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వ్యవహారిక భాషలోనే పుస్తక రచన చేయాలని ఉద్యమించి సాహిత్యాన్ని సామాన్యుడికి చేరువ చేసిన గిడుగు రామ్మూర్తి స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం దగ్గర నుండి పాలనలో తెలుగును ప్రవేశపెట్టడం వరకూ భాషా వ్యాప్తికి, సంరక్షణకు నడుం కట్టింది తెలుగుదేశమేనని అన్నారు.

తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మాట్లాడే భాష, మాతృభాష ఒకటే కావాలని పరితపించి, ఆ దిశగా వ్యవహారిక భాషోద్యమాన్ని నడిపిన గిడుగు వెంకట రామ్మూర్తిని తెలుగు జాతి ఎన్నటికీ మరువవదన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగుకు అంజలి ఘటిస్తున్నానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన సాగిస్తున్న వైసిపికి తెలుగు భాషపై ఆసక్తి లేదని, భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. గిడుగు రామ్మూర్తి స్ఫూర్తిని తెలుగు భాషాభిమానులు, అధ్యాపకులు, సాహితీవేత్తలు అందిపుచ్చుకోవాలన్నారు.

పోలవరంపై కేంద్ర జలశక్తిశాఖ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుపై మంగళవారం నిర్వహించాల్సిన కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సమావేశం వాయిదా పడింది. కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ నేతృత్వంలో జరిగే ఈ హైలెవల్ మీటింగ్‌లో డయాఫ్రం వాల్ మరమ్మతులు, అప్పర్ కాఫర్ డ్యామ్, గైడ్ బండ్‌పై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నివేదిక తదితర అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ కీలక భేటీ వాయిదా పడింది. కేరళలో ఘనంగా జరిగే ఓనం పండగ నేపథ్యంలో ఈ భేటీ వాయిదా పడినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఉగాది తర్వాత టిడిపి కనుమరుగు

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉగాది తర్వాత టిడిపి కనుమరుగవుతుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు వంటి దుష్ట శక్తులు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నాయన్నారు. ఎన్నికల ప్రజాక్షేత్రంలో ఎవరి సత్తా ఏంటో తేలుతుందన్నారు. 'బిజెపి గేట్లు పట్టుకుని వేలాడుతూ, మీరు గేట్లు తీస్తే మా పార్టీ ఉండదని అంటున్నావు, నీకైమైనా బుర్ర పాడైందా చంద్రబాబు' అంటూ ప్రశ్నించారు.

క్రమశిక్షణ తప్పనిసరి

- ఆర్‌టిసి ఎమ్‌డి తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులు విధినిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అన్నారు. మంగళవారం విజయవాడలోని విద్యాధరపురంలోని ట్రాన్స్‌పోర్టు అకాడమిలో ఆర్‌టిసిలోని స్క్వాడ్, ట్రాఫిక్ అధికారులతో ఎమ్‌డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కండక్టర్లు, డ్రైవర్లు.. ప్రయాణికుల మన్ననలు పొందుతూ మెరుగైన సేవలు అందించాలని కోరారు. టికెట్ విషయంలో అప్రమత్తంగా వుండాలని సూచించారు. విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 12 మందికి రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎ కోటేశ్వరరావు, ఆర్‌టిసి ఉన్నతాధికారులు విజయగీత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిని తిరస్కరించినా మరలా అవకాశం

- రూల్ 28కి సవరణలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగోన్నతికి శాశ్వత తిరస్కారం తెలిపినా, మరలా పొందేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎపిఎస్ఎస్ఆర్ 1996 రూల్ 28కి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఒకసారి ఉద్యోగి తనకు ప్రమోషన్ వద్దనుకుంటే భవిష్యత్తులో మళ్లీ ప్రమోషన్ పొందే అవకాశం ఉండదు. ప్రభుత్వం తాజాగా చేసిన సవరణతో ప్రమోషన్‌ను తిరస్కరించిన ఉద్యోగి మళ్లీ ప్రమోషన్ కావాలనుకుంటే ఆ అవకాశాన్ని పొందొచ్చు. ఉద్యోగికి ప్రమోషన్లకు అవకాశం కల్పిస్తూ ఎపి స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు సవరణ చేయడం ఉద్యోగులందరికీ మంచిదేనని పురపాలక టీచర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. పురపాలక పాఠశాలల్లో పిల్లలు పది శాతం అదనంగా పెరిగారని, వారికి అనుగుణంగా పురపాలక టీచర్లకు గత మూడేళ్లుగా ఉద్యోగోన్నతులు లేవని, వెంటనే కల్పించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న అన్ని రకాల కోర్టు కేసులను పరిష్కరించుకునేందుకు సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్‌ఎల్‌ఎస్‌ఎ సభ్య కార్యదర్శి ఎం బబిత తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పెండింగ్‌లో వున్న క్రిమినల్, సివిల్, మోటారు ప్రమాదపరిహార కేసులు, లేబర్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులను లోక్‌అదాలత్‌లో స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

హరికృష్ణకు నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చంద్రబాబు ట్వీట్ చేశారు. నిండైన ఆత్మీయత, అభిమానానికి హరికృష్ణ నిలువెత్తు రూపమని అన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు హరికృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీతల సుజాత, ఎం వెంకటేశ్వరరావు, టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ దారపునేని నరేంద్ర, నాయకులు ఎవి రమణ, బుచ్చిరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కొలుపుల్లో టిడిపి, వైసిపి పరస్పరం దాడులు

5 గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామంలో మంగళవారం సత్తెమ్మతల్లి కొలుపుల సందర్భంగా ఊరేగింపు జరుగుతుండగా చెలరేగిన వివాదం టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు రాళ్లు, కత్తులు, కర్రలతో దాడులు చేసుకున్నారు. వైసిపికి చెందిన పొన్నాల వెంకటేశ్వర్లు, రాజబోయిన రవీంద్ర, ఎస్ ఆంజనేయులు, టిడిపికి చెందిన రాజబోయిన మధు, నక్క శివ నాగరాజులకు గాయాలయ్యాయి. వీరు ఐదుగురినీ మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. గాయాల పాలైన వీరందరూ సమీప బంధువులు. ఒకే సామాజిక తరగతికి చెందిన వారు. కొలుపుల సందర్భంగా కుంకుమ బండి ఊరేగింపుగా వెళ్తుండగా చల్లుకుంటున్న పసుపు వైసిపికి చెందిన నాయకుడి ఇంటి ముందు పడడంతో వివాదం చెలరేగినట్టు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొనడంతో గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సెప్టెంబరు మొదటి వారంలో 5 లక్షల ఇళ్లు పంపిణీ !

- సామర్లకోటలో సిఎం పాల్గొనే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్ల పంపిణీ కార్యక్రమం మళ్లీ వాయిదా పడింది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని ఇదే నెల 30న ప్రారంభించాల్సివుండగా..అది మళ్లీ సెప్టెంబరు మొదటి వారానికి వాయిదా పడినట్లు తెలుస్తోంది. గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల గృహాలు నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. వీటిని సెప్టెంబరు మొదటి వారంలో లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది. సామర్లకోటలో జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లను పంపిణీ చేయనున్నారు. నిర్మాణాలు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడంతో ఒకట్రెండు సార్లు పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది. ఈ దఫా కార్యక్రమం వాయిదా పడకూడదనే లక్ష్యంతో జిల్లాల వారీ ఉన్నతాధికారులు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. గృహ నిర్మాణాల నాణ్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని గృహ నిర్మాణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీశా, జెఎమ్‌డి శివప్రసాద్ జిల్లా స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ, క్షేత్రస్థాయి అధికారులకు టార్గెట్లు ఇచ్చి పనులు చేయించారు.

ఐదు లక్షల గృహాలు పూర్తి : గృహ నిర్మాణ శాఖ

అనంతపురం జిల్లాలో 15,900 గృహాలు, ఏలూరులో 26,047, అన్నమయ్య 25,747, శ్రీసత్యసాయి 15,832, నంద్యాల 21,392, కర్నూలు 15,929, శ్రీకాకుళం 32,413, విజయనగరం 36,096, పార్వతీపురం మన్యం 12,232, అల్లూరి సీతారామరాజు 530, విశాఖపట్నం 8,983, కాకినాడ 20,437, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ 8,630 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. తూర్పుగోదావరి 20,359, కృష్ణా, 20,236, ఎన్‌టిఆర్ 15,127, బాపట్ల 11,871, పల్నాడు 9,617, ప్రకాశం 18,659, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా 13,525, తిరుపతి 20,811, వైఎస్ఆర్ కడప 28,452, అనంతపురం 20,337, చిత్తూరు 42,478, పశ్చిమగోదావరి 25,475, గుంటూరు జిల్లాలో 12,923 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ పేర్కొంది. మొత్తం ఇప్పటి వరకు 5 లక్షల 653 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపింది.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన 'చలో ఎయు'

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)



డిగ్రీ విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చలో ఎయు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత ఆ సంఘం నాయకులు, విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద ధర్నా చేశారు. విసి ప్రసాదరెడ్డిని కలిసి విద్యార్థుల సమస్యలను తెలియజేసేందుకు లోపలకు వెళుతుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పలువురిపై పోలీసులు దాడికి దిగారు. 'చలో ఎయు' సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ సెప్టెంబరు ఒకటి నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ యాజమాన్యం షెడ్యూల్ విడుదల చేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గత సెమిస్టర్ పరీక్షలు రాసి ఐదు నెలలైనా పూర్తి కానందున అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో ల్యాబ్ వర్క్ పూర్తిగా జరగలేదన్నారు. కనీసం 50 శాతం సిలబస్సైనా పూర్తికాకుండా పరీక్షలు నిర్వహిస్తే తాము ఫెయిలవుతామన్న ఆందోళనలో విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారి భవిష్యత్తుతో వర్సిటీ అధికారులు చెలగాటమాడడం సరికాదన్నారు. సమస్యను విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వర్సిటీ ఎదుట భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ, విజయనగరం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి పి రామ్మోహనరావు, నాయకులు రాము, సౌమ్య, హర్ష, ఎయు కార్యదర్శి పి సూర్య, హర్షిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు 4, 5 తేదీల్లో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు అర్హత కలిగిన అభ్యర్థులకు సెప్టెంబరు 4న ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రటనలో పేర్కొన్నారు. మిగిలిన సీట్లకు 5న మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న, దరఖాస్తు చేయని అర్హులైన అభ్యర్థులు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చునని తెలిపారు.

టిటిడి పాలకమండలి సభ్యుల నియామకంపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

క్రిమినల్ కేసుల విచారణను ఎదుర్కొంటున్న వారిని టిటిడి పాలకమండలి సభ్యులుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. క్రిమినల్ కేసులున్న జగ్గయ్యపేట వైసిపి ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను, ఢిల్లీ లిక్కర్ స్కామ్ నిందితుడు అరబిందో గ్రూప్ డైరెక్టర్ పి శరత్ చంద్రారెడ్డి, అవినీతి ఆరోపణలతో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ పదవిని కోల్పోయిన కేతన్ దేశాయ్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు సభ్యులుగా నియమించడాన్ని అడ్డుకోవాలని హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ మేరకు విజయవాడకు చెందిన రిటైర్డు రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. .

టిడిపి నేతల కేసు రేపటికి వాయిదా

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లులో జరిగిన ఘటనల నేపథ్యంలో పోలీసులు నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టిడిపి నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు ఈ నెల 31కి వాయిదా వేసింది. టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, డి రమేష్, తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ఇతర నేతలు ప్రసాద్‌రెడ్డి, బండారు గణేష్ దాఖలు చేసిన పిటిషన్లను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ కె సురేష్‌రెడ్డి ప్రకటించారు.

రిటైర్మెంటు వయసు 65 ఏళ్లకు పెంచాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు రిటైర్మెంటు వయసును 65 ఏళ్లకు పెంచాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామన్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మరిచిపోయారని విమర్శించారు. తెలంగాణలో వేతనాలతోపాటు రిటైర్మెంటు వయసును 65 ఏళ్లకు పెంచిందని తెలిపారు. అలాగే రిటైర్మెంటు బెనిఫిట్ కింద రూ.ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై సిట్ ఏర్పాటు ఉత్తర్వులు నిలుపుదల

ప్రజాశక్తి-అమరావతి

ఎర్రచందనం, ఇతర అటవీ ఉత్పత్తుల స్మగ్లింగ్ కేసుల దర్యాప్తునకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ నిలుపుదల చేసింది. సిట్ ఏర్పాటు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఎర్రచందనం స్మగ్లింగ్ లారీ వెంట ఒక ఇన్నోవా వాహనం వెళుతుంటే డిఎఫ్ఒ జప్తు చేశారు. దీనిని ఇన్నోవా యజమాని ఎర్రగుంట్ల బాలచంద్రుడు నంద్యాల జిల్లా కోర్టులో సవాల్ చేశారు. దీనిని కొట్టేయడంతో ఆయన 2014లో హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. 2013 నాటి కేసులో 2023లో కూడా పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు సింగిల్ జడ్జి పైవిధంగా సిట్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌కు సివిల్ కోర్టు జడ్జికి ఉండే అధికారులన్నీ ఉంటాయని కూడా చెప్పారు. అటవీ, పోలీస్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జిలు కూడా సిట్‌కు సహకరించాలన్న తీర్పును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్ వద్ద అప్పీల్ దాఖలు చేసింది. సింగిల్ జడ్జి పరిధి దాటి ఉత్తర్వులు ఇచ్చారని ఎజి ఎస్ శ్రీరామ్ వాదనల తర్వాత హైకోర్టు సిట్ ఏర్పాటు ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేసింది.

ఖర్చులో పొదుపు ఎలా?

- ఆర్థికశాఖతో సిఎం సమీక్ష

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వస్తున్న ఆదాయాన్ని ఎలా వ్యయం చేయాలి? చేస్తున్న ఖర్చును ఎలా తగ్గించాలన్న అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్థికశాఖ అధికారులతో చర్చించారు. మంగళవారం ఆదాయ వనరులపై జరిగిన సమీక్షా సమావేశంలో ఖర్చును సాధ్యమైనంత మేర ఎలా తగ్గించాలన్న అంశంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది. సాధారణంగా ఆదాయపెంపుపై రకరకాల సూచనలు చేసే ముఖ్యమంత్రి ఈ సారి దానికి భిన్నంగా పొదుపు చేయడం గురించి మాట్లాడటం అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో అత్యవసరమైన వాటికే నిధులను ఖర్చు చేయాలని చెప్పినట్లు సమాచారం. ముందుగా సంక్షేమ కార్యక్రమాలకు, ప్రజలకు ఉపయుక్తంగా ఉండే పథకాలకు మాత్రమే నిధులు వ్యయం చేయాలని సిఎం నిర్దేశించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఇతర ఆర్థికశాఖ అధికారులు గుల్జార్, సత్యనారాయణలతో ఈ సమావేశాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఎప్పుడూ ఆదాయ వనరుల శాఖలతో ఆదాయ, వ్యయాలపై చర్చించే ఆయన మంగళవారం ఖజానాకు వస్తున్న నిధులను అవసరాలకు తగ్గట్లుగా ఎలా పొదుపుగా వ్యయం చేయాలన్నదానిపై సమీక్షించినట్లు తెలిసింది.

వెంకట నర్సమ్మకు న్యాయం చేయాలి

- సిఎంకు ఐద్వా లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా కనిగిరి మండలం గొల్లపల్లి వద్ద ఈ నెల 12న హత్యకు గురైన బాలిక మంజుల తల్లి వెంకట నర్సమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు లేఖ రాశారు. ఈ నెల 26న తాము నర్సమ్మను పరామర్శించామని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెను ఇంతవరకు అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ కలవలేదని పేర్కొన్నారు. ముసలి అత్తామామలతో ఉంటూ బిడ్డను కోల్పోయి బతుకుమీద విశ్వాసం కోల్పోయారని అన్నారు. ఆమెకు ప్రభుత్వ పరంగా చేయాల్సిన సాయం అలందించాలని కోరారు. ఆడపిల్లను కోల్పయిన ఆమెకు మరో ఇద్దరు బిడ్డలు ఉన్నారని, వారికి పునరావాసం కల్పించాలని, బిడ్డను చంపిన ఆమె భర్తను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని డిమాండ్ చేశారు. తక్షణం రూ.10 లక్షల సాయం అందించాలని, ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని, బిఎస్ కింద నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. అలాగే ఆమె అత్తమామలకు రెండెకరాల భూమి ఇవ్వాలని కోరారు. నిందితుడిని త్వరితగతిన శిక్షించాలని, మద్య నిషేధ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 357(ఎ) సిఆర్‌పిసి ప్రకారం బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక విధదివిధానాలు రూపొందించి అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. మద్యం మహమ్మారి, దిగజారుతున్న విలువలు చిన్నారి మంజులను బలిగొన్నాయని వివరించారు. మద్యం ప్రభావాన్ని, హీన సంస్కృతిక ప్రభావాలను ప్రభుత్వం పరిశీలించాలని అన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో పెద్దయెత్తున ఉద్యమం చేపడతావని హెచ్చరించారు.

చేయని పనులకు యుసిలు

- ఒత్తిడి చేస్తున్న ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పలు శాఖల ద్వారా రాష్ట్రంలో చేస్తున్న ఖర్చులపై చిత్రమైన పరిస్థితి నెలకొంది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా, నామమాత్రం కూడా పనులు చేయకుండా వినియోగపు ధృవపత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికేట్ -యుసి) కావాలని వివిధ శాఖలపై ఆర్థికశాఖ ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. దీనికి శాఖల అధికారులు తిరస్కరిస్తున్నారు. విడుదల చేసిన నిధులపై యుసిలు కావాలని కేంద్ర ఆర్థికశాఖ అడుగుతున్న నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొంది. పనులు నిర్వహించే శాఖనుంచి యూసీలు రాకపోవడంతో కేంద్రానికి సమాధానం చెప్పుకోలేక రాష్ట్ర అధికారులు సతమతమవుతున్నారు. దీనివల్ల అదనంగా రావాల్సిన నిధులు కూడా రాష్ట్రానికి రావడం లేదని అధికారులు అంటున్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు పబ్లిక్ డిపాజిట్ ఖాతాల ద్వారా వేరే అవసరాలకు వ్యయం చేస్తున్నారు. యుసిలు ఇయ్యవలసి రావడంతో నిధులు ఇవ్వకపోయినా సంబంధింత శాఖలపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే, నిధులు ఇవ్వకుండా, ఖర్చు చేయకుండా యుసిలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని శాఖల అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇలా జరగని పనులకు వినియోగ ధృవీకరణ పత్రాలు ఇస్తే భవిష్యత్తులో తాము ఇబ్బందుల్లో పడాల్సి వస్తుందని ఒక ఉన్నతాధికారి చెప్పారు.

వైసిపి నాయకుల నుంచి ప్రాణహాని

- డిజిపికి టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని డిజిపికి టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు పల్లాల రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు వివరాలు తెలిపారు. మారేడుమిల్లి మండలం కుట్రవాడ గ్రామంలో జరిగిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కొంతమంది వైసిపి నాయకులు కత్తులు, ఉపాకితో తనను చంపేందుకు వెంబడించారని పేర్కొన్నారు. దీనిపై అక్కడి సిఐకి ఫిర్యాదు చేశామని, దర్యాప్తు లేనందున తనకు ప్రాణహాని ఉందని అన్నారు. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ను ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. తాను ఎక్కడికి వెళితే అక్కడకు అనంత ఉదయభాస్కర్ అనుచరులు వెంబడిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. దీనిపై విచారణ జరిపి ఎమ్మెల్సీ ఉదయభాస్కర్, ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, మారేడుమిల్లి జెడ్‌పిటిసి గొర్లె బాలాజీబాబు, అనిల్‌కుమార్, రవికుమార్, అనుదీప్ తదితరుల నుంచి తనకు రక్షణ కల్పించాలని డిజిపికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కెఎ.పాల్ 'ఉక్కు' ఆమరణ దీక్ష భగ్నం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



కెజిహెచ్ నుంచి బయటకు వస్తున్న కెఎ.పాల్

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ విశాఖలోని ఆశీలుమెట్ట వద్దనున్న తన ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు మంగళవారం భగ్నం చేశారు. అనంతరం కెజిహెచ్‌కు తరలించగా వైద్య పరీక్షలకు ఆయన నిరాకరించారు. తన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని రాతపూర్వకంగా వైద్యాధికారులకు ఇచ్చి అక్కడి నుంచి మరలా తన ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కెఎ.పాల్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. శాంతియుతంగా తాను దీక్ష చేస్తుంటే దానిని భగ్నం చేశారని తెలిపారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ప్లాంట్ కోసం తన ప్రాణాన్ని సైతం అర్పించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. దీక్ష విరమించాలని తనకు మంత్రులు, నాయకులు ఫోన్లు చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగాలంటే రాష్ట్రంలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసి పోరాటానికి దిగాలని, అప్పుడే కేంద్రం స్పందిస్తుందని చెప్పారు. పాల్ పోరాటానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, విశాఖ వాసులు మద్దతు తెలిపారు.

రాష్ట్రానికి పెద్ద సమస్య జగనే!

(మొదటి పేజీ తరువాయి)

కూటముల్లో భాగంగా ఉందని, జాతీయ రాజకీయాలతో టిడిపికి అనుబంధం ఉందని అన్నారు. ప్రతిపక్షాల ఇండియా బ్లాక్ ఎలా ముందుకు వెళ్తుందో చూడాలని, ఆ కూటమికి నాయకుడు లేకపోవడం బిజెపికి అనుకూల అంశమని అన్నారు. మోడీ వయసు గురించి మాట్లాడే దమ్ము వైసిపి వాళ్లకు ఉందా? అని ప్రశ్నించారు. ఏపి, తమిళనాడులో కాంగ్రెస్ పుంజుకునే అవకాశం లేదని, దక్షిణాదిలో తెలంగాణ, కర్ణాటకలోనే కాంగ్రెస్ ఉందని పేర్కొన్నారు.

అదాని, అంబానీ, టాటా అంటూ కొందరికే ఆస్తులు సృష్టించే కంటే ప్రతి కుటుంబానికి ఆస్తి సృష్టించే అవకాశం కల్పించాలని అన్నారు. ప్రతి భారతీయుడు ప్రపంచం గురించి ఆలోచించాలని, ఇక్కడ కూర్చుని ప్రపంచ అవసరాలు తీర్చే ఉద్యోగం చేయొచ్చని పేర్కొన్నారు. భారతీయుడు భూమి మీద ఎక్కడైనా మనగలగ గలడని, భారతీయులకు ఉన్న గొప్ప లక్షణం అదేనని అన్నారు.

'జగన్‌పై హత్యాయత్నం' కేసుపై విచారణ 6కు వాయిదా

ప్రజాశక్తి - లీగల్ న్యూస్ (విశాఖపట్నం)

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'జగన్‌పై హత్యాయత్నం' కేసు సెప్టెంబరు 6వ తేదీకి వాయిదా పడింది. ఇటీవలే విజయవాడ ఎన్ఐఎ కోర్టు నుంచి విశాఖపట్నం జిల్లా కోర్టుకు ఈ కేసు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నగరంలోని మూడో అదనపు జిల్లా న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న జె.శ్రీను ఇప్పటికి ఏడుసార్లు బెయిల్ పిటిషన్లు వేయగా కోర్టు తిరస్కరించింది. తాజాగా మంగళవారం ఎనిమిదో సారి నిందితుడు తరపు న్యాయవాది అబ్దుల్ సలీం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తరుపున ఆయన తాలూకా సాక్ష్యాన్ని వీడియో లింక్ ద్వారా స్వీకరించడానికి అనుమతి ఇవ్వాలని కూడా పిటిషన్ దాఖలైంది. దీనిపై ఎన్ఐఎ కౌంటర్ దాఖలు చేయాలని, సెప్టెంబర్ ఆరుకు కేసును వాయిదా వేస్తున్నామని న్యాయమూర్తి తెలిపారు.

విషమంగా పోలా రామాంజినేయులు ఆరోగ్యం



ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకుడు పోలా రామాంజినేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆయన అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత కొంతకాలంగా ఆయన మెడనొప్పి వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికి తోడు షుగర్, గ్యాస్ సమస్యలు తోడయ్యాయి. ఆరోగ్యం విషమించడంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వేరుశనగపై 'అనంత' రైతన్న నిరాసక్తి

• ఏటా పడిపోతున్న సాగు విస్తీర్ణం • గిట్టుబాటు కాకపోవడమే కారణం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటేనే గుర్తుకొచ్చేది కరువు... వేరుశనగ పంట. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం కలిగిన ఈ ప్రాంతంలో తక్కువ వర్షానికైనా పండగలిగే పంట వేరుశనగ ఒక్కటే. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏటా ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రకృతి తోడ్పాటు, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఈ ప్రాంత రైతుల్లో దశాబ్దకాలంగా వేరుశనగ సాగుపై ఆసక్తి తగ్గుతూ వస్తోంది. దీంతో, ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ పంట సాగు విస్తీర్ణం ప్రస్తుతం గణనీయంగా పడిపోయింది. 2011లో 20.11 లక్షలు సాగయ్యేది. క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం 4.77 లక్షల ఎకరాలకే పరిమితమైంది. గత 13 ఏళ్లలో 15.41 లక్షల ఎకరాల్లో సాగు తగ్గిపోయింది.



సాగులో ఉన్న వేరుశనగ పంట

పెరుగుతున్న పెట్టుబడులు

వేరుశనగ సాగు పెట్టుబడి ఏటా పెరిగిపోతోంది 2011లో ఎకరం విస్తీర్ణంలో వేరుశనగ సాగుకు రూ.7,084 ఖర్చయ్యేది.ప్రస్తుతం ఈ ఖర్చు రూ.32 వేలకు చేరింది. దాదాపు నాలుగు రెట్లు పెట్టుబడి వ్యయం పెరిగింది. అందుకు తగ్గట్టు పంట దిగుబడులు లేకపోవడం, వర్షాభావంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. 2017లో అత్యధికంగా ఎకరానికి 441 కిలోల దిగుబడి వచ్చింది. మిగతా ఏ సంవత్సరం కూడా 300 కిలోలకు మించి రాలేదు. తీవ్ర వర్షాభావం వల్ల 2016లో ఎకరానికి 87 కిలోలే దిగుబడి వచ్చింది.

దీమా ఇవ్వని వాతావరణ బీమా

వేరుశనగ పంటకు నష్టం జరిగితే బీమా రూపంలో ప్రభుత్వం రైతులను ఆదుకునేది. 2011కు ముందు వరకూ త్రెస్‌హోల్డ్ ప్రకారం అంటే, మూడేళ్ల సగటు దిగుబడిని లెక్కించి దాని కంటే తక్కువ దిగుబడి వస్తేనే బీమా వచ్చేది. దీనివల్ల ప్రయోజనం లేదని బీమా విధానంలో మార్పులు తీసుకొచ్చారు. 2011 నుంచి వాతావరణ బీమాను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. పంట కాలాన్ని మూడు భాగాలుగా విడగొట్టి ఆ కాలంలో కురిసే వర్షపాతాన్ని బట్టి రైతులకు పరిహారం అందించే పద్ధతిని తీసుకొచ్చింది. ఈ విధానంలోనూ రైతులకు పరిహారం సరిగా రావడం లేదు. ఓ వైపు వర్షాలు లేక దిగుబడి రాకపోవడం, మరోవైపు ప్రభుత్వ సాయం లేకపోవడం వేరుశనగ సాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గడానికి ప్రధాన కారణం.

సంవత్సరం	విస్తీర్ణం (లక్షల ఎకరాలు)	పెట్టుబడి ఎకరాకు రూపాయల్లో	దిగుబడి (ఎకరాకు (కోట్ల కిలోల్లో)	బీమా వచ్చింది రూపాయల్లో)
2014	12.56	14,159	95.62	25.61
2015	9.98	15,170	271	109.66
2016	15.02	18,013	87	419.1
2017	9.95	18,420	401	159.2
2018	13.41	20,029	130.31	531.64
2019	9.16	20,439	278	361.91
2020	11.76	24,529	184	263.35
2021	10.89	25,000	150	150
2022	9.61	26,000	200	117
2023	4.77	32,000	పంట సాగులో ఉంది	పంట సాగులో ఉంది

బీమా విధానంలో మార్పు తేవాలి



అనంతపురం జిల్లా వాతావరణ పరిస్థితుల్లో ప్రధానంగా పండేది వేరుశనగ పంట ఒక్కటే. ప్రభుత్వం ఈ పంటకు తగినంత ప్రోత్సాహకం అందివ్వాలి. ఇప్పుడున్న బీమా విధానం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండా ఉంది. వాతావరణ బీమా కాకుండా దిగుబడి ఆధారంగా బీమా వర్తింపజేయాలి. అది కూడా గతంలోలాగా సగటు దిగుబడి కాకుండా పెట్టుబడి ఆధారంగా రైతును ఆదుకునే విధంగా బీమాలో మార్పులు చేయాలి. ప్రభుత్వం స్పందించి వేరుశనగ రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలి.

-చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం అనంతపురం జిల్లా కార్యదర్శి

పేదలకు ఉచిత వైద్యమే లక్ష్యం

• నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - కుప్పం (చిత్తూరు)



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

పేదలకు ఉచిత వైద్యం అందించడమే ఎన్‌టిఆర్ ట్రస్ట్ లక్ష్యమని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో 'సంజీవని' ఆరోగ్య కేంద్రం సంచార వాహనాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత గంగమాంబ దేవాలయానికి చేరుకున్న ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్యాలెస్ రోడ్డులో సంజీవిని మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి నందమూరి తారక రామారావు నమ్మిన 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న సూక్తిని నిజం చేస్తూ ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరపున ప్రజలకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించాలన్న సదుద్దేశంతో సంజీవిని ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధులకు ఉచితంగా చికిత్స అందించి, ఔషధాలను ఇవ్వనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పెద్దబంగారునత్తం గ్రామ పరిధిలోని ధర్మరాజుల దేవస్థానం ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు నాలుగు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

దోసపాడు దళితులకు న్యాయం చేయాలి

- పోలీస్ అధికారుల తీరు దుర్మార్గం
- వ్యకాస ఆధ్వర్యాన కొవ్వలిలో నిరసన

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)



ఆటోలను తీసుకెళ్తున్న పోలీసులను అడ్డుకున్న మహిళలు

'భూమి మాదే, పంట మాదే, హక్కులు మాకే దక్కాలి' అంటూ నినదిస్తూ వ్యకాస ఆధ్వర్యాన ఏలూరు జిల్లా దెందులూరులోని కొవ్వలిలో మంగళవారం రెండు రోజు నిరసనగా దోసపాడు పేదలు, దళితులు చేపలు పట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత పి ఆనందరావు మాట్లాడుతూ గతేడాది నుండి బాధితులు భూముల కోసం మొక్కవోని దీక్షతో పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. చెరువుల వద్ద చేపలు పడుతున్న నేపథ్యంలో ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సిబ్బందితో వచ్చి మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. హక్కుల కోసం పోరాడుతుంటే రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉండగా పోలీసులు జోక్యం చేసుకుని దళితులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. దళితులను హెడ్ కానిస్టేబుల్ రమేష్ నోటికొచ్చినట్లు దూషించడం తగదన్నారు. ఉన్నతాధికారుల ముందే బాధితులను హెడ్ కానిస్టేబుల్ దుందుడుకుగా వ్యవహరిస్తూ కించపరుస్తున్నారని తెలిపారు. చేపల చెరువుల వద్దకు తీసుకెళ్లిన ఆటోలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించగా మహిళలు అడ్డుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతావని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్ జాన్‌రాజు, నాగేంద్ర, పవన్, రవికుమార్, మణి, మాణిక్యం, గౌరీ, శ్రీను, ఏసుమణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వైఫల్యంతో ప్రజలపై భారాలు : సిపిఎం

అనంతపురంలో సమరభేరి యాత్ర ప్రారంభం



సమరభేరి ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా, ప్రజలపై భారాలు వేసేలా ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం అనంతపురం నగర ఒకటవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమరభేరిని మంగళవారం పాతూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెంచిందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించకుండా దగా చేసిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తుంటే సున్నిత అంశాలను రెచ్చగొట్టి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే కుటిల పరిపాలనను సాగిస్తోందని ధ్వజమెత్తారు. మోడీ ఆదేశాలను తూచా తప్పకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శిం చారు. విద్యుత్ సంస్కరణలతో ప్రజలపై భారాలు మోపుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు అదుపు చేయాలని, ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు సిపిఎం సమరభేరి మోగిస్తోందన్నారు. 5వ తేదీన అనంపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర ఒకటవ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, మసూద్, గపూర్, బాలకృష్ణ, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, హమాలీ యూనియన్, భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాల్సిందే..

విశాఖ పోర్టు కంటైనర్ టెర్మినల్ వద్ద మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



కంటైనర్ టెర్మినల్ గేటు వద్ద బైఠాయించిన మత్స్యకారులు

తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు మంగళవారం ఆందోళనకు దిగారు. విశాఖపట్నం పోర్టు ప్రాంతంలోని కంటైనర్ టెర్మినల్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. టెర్మినల్ గేట్లు మూసివేసి, అన్ని రకాల కార్యకలాపాలనూ అడ్డుకున్నారు. 20 ఏళ్ల క్రితం విశాఖ కంటైనర్ టెర్మినల్ కోసం మత్స్యకారుల నుంచి భూములను సేకరించిన అధికారులు ఆనాడు చేసుకున్న ఒప్పందాన్ని నేటికీ అమలు చేయనందుకు మత్స్యకారులు ఈ ఆందోళనకు దిగారు. వారి పోరాటానికి మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చింతపల్లి అయ్యప్పరాజు, ఉపాధ్యక్షులు నొల్లు పోతురాజు, గౌరవాధ్యక్షులు వాడమోదుల పెంటయ్య, ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ నాయకత్వం వహించారు. సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, తెలుగు యువత నాయకులు తాతాజీ మద్దతు తెలిపారు. ఈ ఆందోళనలో నేతలు మాట్లాడుతూ.. 2002లో మత్స్యకారుల నుంచి భూములు సేకరించిన సమయంలో 574 మంది మత్స్యకారులకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కోల్పోయిన భూమికి బదులుగా తీర ప్రాంతానికి సమీపంలో ఒక్కొక్కరికీ 60 గజాలు చొప్పున భూమి ఇచ్చి పక్కా గహాలు నిర్మిస్తామని టెర్మినల్ యాజమాన్యం అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తరువాత రూ.25 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. గౌరవం లేని ఉద్యోగాలు ఇవ్వడంతో ఏడుగురు మాత్రమే ఉద్యోగాల్లో చేరారని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆందోళన చేసిన సందర్భంలో కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికీ నెరవేరలేదని అన్నారు. మత్స్యకారుల ఆందోళన విషయం తెలిసి ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ సంఘటనా స్థలానికి వచ్చి నాయకులతో చర్చలు జరిపారు. పది రోజులు గడువు ఇస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలపడంతో అందుకు మత్స్యకారులు నిరాకరించి ఆందోళనను కొనసాగించారు.

బైజూస్‌కు మరో ఎదురుదెబ్బ

- చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాజీనామా
- వైదొలిగిన మరో ఇద్దరు ఉన్నతాధికారులు



బెంగళూరు : కరోనా కాలంలో ఒక వెలుగు వెలిగిన ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ తీవ్ర గడ్డుకాలాన్ని ఎదుర్కొంటుంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సంస్థకు వరుసగా ఒక్కొక్క ఉన్నతోద్యోగి గుడ్‌బై చెబుతున్నారు. తాజాగా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సిబిఒ) ప్రత్యూష అగర్వాల్ సహా మరో ఇద్దరు సీనియర్ ఉద్యోగులు వైదొలిగారు. ప్రత్యూష 2022 ఫిబ్రవరిలో బైజూస్‌లో చేరారు. అంతకుముందు ఆమె జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్‌లో పనిచేశారు. మరో ఇద్దరు ఉన్నతోద్యోగులు హిమాన్షు బజాజ్, ముకుట్ దీపక్‌లు సంస్థకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికను అమలు చేస్తోన్నట్లు బైజూస్ పేర్కొంది. అందులో భాగంగా నాలుగు బిజినెస్ విభాగాలను కె-10, ఎగ్జామ్ ప్రెప్ అనే రెండు భాగాలుగా మార్చినట్లు తెలిపింది. బైజూస్ ఇప్పటికే ఆర్థిక కష్టాలతో పాటు అనేక న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటుంది. మరోవైపు అకౌంట్స్ విషయంలోనూ అనేక అవకతవకలకు పాల్పడినట్లు పలు రిపోర్ట్‌లు వస్తోన్నాయి. కష్టాలు తీవ్రతరం కావడంతో అనేక మంది ఉద్యోగులను తొలగించింది. అదే విధంగా 2025 వరకు కొనసాగాల్సిన ఆడిట్ సంస్థ డెలాయిట్ సైతం మధ్యలోనే గుడ్‌బై చెప్పింది. మరోవైపు విదేశీ నిధులు ఉల్లంఘనలకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణ జరుపుతోంది. బైజూస్ వ్యవస్థాపకులు రవీంద్రన్, ఆయన కంపెనీ థింక్ అండ్ లెర్న్ కార్యాలయాల్లో ఫెమా చట్టం కింద గత నెలలో అధికారులు సోదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ స్టార్టప్ పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కేసు నమోదు చేసి ఇడి దర్యాప్తు చేస్తోంది. బైజూస్ 2011 నుంచి 2023 మధ్య దాదాపు రూ.28 వేల కోట్ల విలువైన విదేశీ పెట్టుబడులు అందుకుందని తమ తనిఖీల్లో తేలిందని ఇడి వర్గాలు పేర్కొన్నాయి. అంతర్గతంగా పాలనాపరమైన లోపాలను అధిగమించేందుకు ప్రముఖ వ్యాపారవేత్త మోహన్‌దాస్ పాయ్, ఎస్‌బిఐ మాజీ ఛైర్మన్ రజినీష్ కుమార్‌తో కంపెనీ ఓ సలహా మండలిని ఏర్పాటు చేసింది. అయినప్పటికీ సంస్థ పునర్‌వైభవం పొందడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మూడేళ్లలో రెట్టింపు మార్కెట్ వాటా లక్ష్యం

- సెంచరీ మ్యాట్రెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెల్లడి
- బ్రాండ్ అంబాసిడర్‌గా పివి సింధు



ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రముఖ పరుపుల కంపెనీ సెంచరీ మ్యాట్రెస్ వచ్చే మూడేళ్లలో 20 శాతం మార్కెట్ వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ తెలిపారు. ప్రస్తుతం తమకు 10 శాతం మార్కెట్ వాటా ఉందన్నారు. సెంచరీ మ్యాట్రెస్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ బ్యాడ్మింటన్ పివి సింధుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మలానీ మాట్లాడుతూ.. భారత్‌లో ఈ రంగం ప్రతీ ఏడాదికి 15 శాతం చొప్పున పెరుగుతోందన్నారు. పరుపుల తయారీలో సంఘటిత రంగం 40 శాతం వాటాను కలిగి ఉందన్నారు. తమ సంస్థకు ఉన్న నాలుగు యూనిట్లలో ఏడాదికి 80 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం కలిగి ఉందన్నారు. 80 శాతం సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటున్నామన్నారు. టాప్ 3 బ్రాండ్లలో ఒక్కటిగా ఉన్నామన్నారు. ప్రతీ ఏడాది 25-50 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామన్నారు. తమ మొత్తం రెవెన్యూలో 10 శాతం ఎగుమతుల ద్వారా వస్తోందన్నారు. మొత్తం టర్నోవర్‌లో సగం దక్షిణాది రాష్ట్రాల వాటా ఉందన్నారు. ప్రస్తుత ఏడాదిలో 35 శాతం వృద్ధి అంచనా వేస్తున్నామన్నారు. గడిచిన మూడేళ్లలో సగటున 30 శాతం వృద్ధి సాధించామన్నారు. సెంచరీ మ్యాట్రెస్‌లు 18 రాష్ట్రాల్లో 4500 డీలర్‌లు, 450 పైగా ప్రత్యేక బ్రాండ్ స్టోర్‌లను కలిగి ఉన్నామన్నారు.

ఐదు అవుట్‌లెట్లను తెరిచిన ఫోక్స్‌వ్యాగెన్

హైదరాబాద్ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ ఫోక్స్‌వ్యాగెన్ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా ఐదు అవుట్‌లెట్‌లను తెరిచినట్లు ప్రకటించింది. వీటిని బంజారాహిల్స్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, కర్నూలు, అనంతపూర్ ప్రాంతాల్లో ప్రారంభించినట్లు వెల్లడించింది. వీటితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తమ నెట్‌వర్క్ 24 విక్రయాలు, 13 సర్వీస్ అవుట్‌లెట్‌లకు పెంచుకున్నట్లయ్యిందని పేర్కొంది. దేశంలో 136 నగరాల్లో 184 డీలర్‌షిప్‌లు, 131 సర్వీస్ అవుట్‌లెట్‌లను కలిగి వినియోగదారులకు సేవలందిస్తోన్నట్లు వెల్లడించింది. కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు అవుట్‌లెట్‌లను పిపిఎస్ మోటార్స్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ నిర్వహించనున్నారని తెలిపింది. "ఈ టచ్‌పాయింట్‌ల ప్రారంభోత్సవంతో తెలుగు రాష్ట్రాల్లోని మా కస్టమర్‌లకు మమ్మల్ని మరింత చేరువ చేస్తుందని మేము నమ్ముతున్నాము." అని ఫోక్స్ వేగన్ ప్యాసింజర్ కార్స్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా అన్నారు.

పోలవరం నిర్వాసితులను
మోసగించిన జగన్

• 'యువగళం'లో నారా లోకేష్



యువగళం పాదయాత్రలో నాగలి ఎత్తి అభివాదం చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, టి.నరసాపురం

పోలవరం నిర్వాసితులకిచ్చిన హామీలన్నీ మరిచిపోయి సిఎం జగన్ వారిని మోసగించారని, నిర్వాసితులకు ఒక్క ఇల్లైనా కట్టలేదని, ఒక్కరికీ పూర్తిగా ప్యాకేజీ ఇవ్వలేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా 198వ రోజు మంగళవారం ఏలూరు జిల్లా పోలవరం నియోజవర్గంలోని టి నరసాపురం మండలంలో కొనసాగింది. తీగలవంచ గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర టి నరసాపురం, గురవాయిగూడెం, ఏపుగుంట, శ్రీరామవరం, తిరుమలదేవిపేట, వెంకటాపురం, బొర్రంపాలెం వరకూ సాగింది. నిర్వాసితుల సమస్యలపై లోకేష్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 72 శాతం పోలవరం పూర్తయిందని, రూ.లక్షా 15 వేల ప్యాకేజీని రూ.6.36 లక్షలకు పెంచామని తెలిపారు. రూ.నాలుగు వేల కోట్లు నిర్వాసితులకు పునరావాసం కింద ఖర్చు చేసినట్లు తెలిపారు. గత నాలుగేళ్లలో పోలవరం పనులు నాలుగు శాతమే పూర్తయ్యాయన్నారు. డయాఫ్రంవాల్, గైడ్‌బండ్ జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దెబ్బతిన్నాయని విమవర్శించారు. నిర్వాసితులకు ప్యాకేజీతోపాటు సౌకర్యాలతో కాలనీలు ఏర్పాటు చేస్తామన్నారు. 2017లో జరిగిన సర్వేకు టిడిపి కట్టుబడి ఉందని, దాని ఆధారంగా ప్యాకేజీ అందిస్తామని హామీ ఇచ్చారు. జగన్ కేసుల విషయంలో తప్ప పోలవరం విషయంలో ఒక్కసారైనా ఢిల్లీ వెళ్లలేదన్నారు. రాష్ట్రాన్ని జగన్ గంజాయి కేపిటల్‌గా మార్చేశారని విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను టిడిపి వచ్చాక తగ్గిస్తామని, ఇల్లు లేని ప్రతి పేదవానికీ అధునాతన టెక్నాలజీతో పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి వచ్చాక దామాషా ప్రకారం ఎస్‌సిలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేస్తామన్నారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్ మధ్య ఆధిపత్య పోరు ఫ్లెక్సీల ఏర్పాటులో బయటపడింది.

'ముందస్తు' స్వాగతిస్తున్నాం : సిపిఐ

ప్రజాశక్తి-మార్కాపురం, కనిగిరి (ప్రకాశం)

కేంద్రంలో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెల్లడించారని, ముందస్తుగా వస్తే వచ్చే డిసెంబరులో ఎన్నికలు జరిగే అవకాశాలు లేకపోలేదని, వాటిని స్వాగతిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముందస్తుగా ఎన్నికలు వస్తే కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న నరేంద్ర మోడీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను చెడగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టును పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాల పునర్విభజనలో మార్కాపురానికి సిఎం జగన్ అన్యాయం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు అందె నాసరయ్య, షేక్ ఖాశిం, దేవండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కనిగిరి చేరిన బస్సు యాత్ర

రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర కనిగిరి పట్టణానికి చేరుకుంది. పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ నుంచి పామూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

హీరో కరిజ్మా మళ్లీ వస్తోంది..



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ హీరోమోటో కార్ప్ దశాబ్ద కాలం తర్వాత తన పాపులర్ మోడల్ బైకు 'హీరో కరిజ్మా'ను మళ్లీ మార్కెట్లోకి విడుదల చేసింది. మంగళవారం ఈ కొత్త కరిజ్మా ఎక్స్‌ఎంఆర్‌ను ఆవిష్కరించింది. దీని ధరనురూ.1,72,900గా నిర్ణయించింది. 210 సిసితో తెస్తోన్న ఈ బైక్‌కు బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరించనున్నారు. ఇది గరిష్ఠంగా గంటకు 143కిలోమీటర్ల వేగంగా ప్రయాణించగలదని ఆ కంపెనీ తెలిపింది.

సంపాదకీయం

విద్వేష సేద్యం తగదు!


"పాపం పుణ్యం ప్రపంచమార్గం/ కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా, అయిదారేడుల పాపల్లారా!" అని మహాకవి శ్రీశ్రీ ప్రస్తావించిన అమాయక చూపుల పసివాళ్లే వాళ్లంతా! ఉపాధ్యాయులు ఏది చెబితే అది మనసుకు ఎక్కించుకునే స్వచ్ఛమైన తెల్ల కాగితాల్లాంటి మనసులు వాళ్లవి. అలాంటి చిన్నారులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి, రేపటికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దటం పాఠశాలల ప్రాథమిక విధి. కానీ, బిజెపి ఏలుబడిలో ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో తరచూ విద్యావనాలు విషవలయాలుగా వార్తలకెక్కుతున్నాయి. పిల్లల మధ్య సమానత్వం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా పాటలూ, పాఠాలూ వల్లె వేయించాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరు వక్రరీతిన వివక్షా బీజాలు నాటుతున్నారు. చెట్టపట్టాలు పట్టుకొని సమైక్య గీతాలు పాడుకోవాల్సిన పిల్లల మధ్య కుల, మత ఉన్మాదాలను జొప్పిస్తున్నారు. యు.పి లోని ముజఫర్‌నగర్ లోని ఖుబ్బాపూర్‌లో నేహా పబ్లిక్ పాఠశాలలో తాజాగా ఇలాంటి లజ్జాకరమైన సంఘటన చోటు చేసుకోవడం దేశాన్ని నివ్వెరపరిచింది. ఎక్కాలు సరిగ్గా అప్పగించలేదని రెండో తరగతిలో ఓ ముస్లిం బాలుడిని తోటి హిందూ బాలురతో రెచ్చగొట్టి మరీ కొట్టించిన ఉపాధ్యాయిని త్రిప్తా త్యాగి దుష్కృత్యం క్షమించరానిది. పదే పదే కొట్టించటం ఒక్కటే కాదు; ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. ముస్లిం పిల్లలు బాగా చదవరని, వారి తల్లులు అసలు పట్టించుకోరని ఇష్టారీతిన ఆమె వ్యాఖ్యానించటం- పిల్లల హృదయాల్లో మత వివక్షను నాటడమే అవుతుంది.

ఇది ఈ ఒక్క పాఠశాలకే, ఈ ఒక్క ఉపాధ్యాయినికే పరిమితమైన సంఘటనగా చూడలేము. యు.పి విద్యాసంస్థల్లో అనేక సందర్భాల్లో, అనేక రూపాల్లో ఇలాంటి వివక్షాపూరిత ఆచరణలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఎన్.ఆర్.సి ఆందోళనల సమయంలో ఓ స్కూల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో- నాటిక ప్రదర్శించిన చిన్నారి మీద, ఆమె తల్లి మీద కూడా రాష్ట్ర ప్రభుత్వం కేసు బనాయించింది. ఆ తల్లిని జైల్లోకి నెట్టింది. చాలా పాఠశాలల్లో ఛత్రపతి శివాజీ ఏకపాత్ర, నాటికల పేరిట ముస్లిం వ్యతిరేక భావాలు బలంగా ప్రచారం పొందుతున్నాయి. పాఠ్యపుస్తకాల్లో ముస్లిం పాలకుల, స్వాతంత్ర్య సమర యోధుల పాఠాలు తొలగించబడ్డాయి. వివిధ ఆందోళనల సందర్భంలో గట్టిగా గొంతు వినిపించిన ముస్లిం విద్యార్థుల, నాయకుల ఇళ్లు బుల్డోజర్లతో కూల్చివేయబడుతున్నాయి. యోగి ప్రభుత్వం నెలకొల్పిన ఇలాంటి వాతావరణమే పసివాళ్లు సంచరించే, పౌరులుగా వికసించే విద్యావనాల్లోనూ ప్రవేశించి, విద్వేషం చిమ్ముతోంది.

పాఠశాలలో వివక్షను, విద్వేషాన్ని వెదజల్లిన ఉదంతంపై అంతగా స్పందించని యోగి ప్రభుత్వం - ఆ సంఘటనను సోషల్ మీడియాలో ప్రచారం చేశాడన్న నెపంతో ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌పై మరోసారి కేసు నమోదు చేసింది. బాలుడి గుర్తింపును వెల్లడి చేశారని ఆ బాలుడి కుటుంబంతో ఎలాంటి సంబంధమూ లేని విష్ణుదత్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు బాలల సంరక్షణ చట్టం కింద కేసు బనాయించింది. వాస్తవానికి ఆల్ట్ న్యూస్‌లోకి రాకముందే ఆ వీడియో విస్తారంగా వైరల్ అయింది. కానీ, తన వెబ్‌సైట్ ద్వారా వాస్తవాలను ప్రపంచానికి చాటుతున్న జర్నలిస్టుపై కక్ష సాధింపు కోసం ఈ సందర్భాన్ని కూడా యోగి ప్రభుత్వం వాడుకోజూస్తోంది. జుబేర్‌పై కొన్నేళ్లుగా అనేక ఎఫ్ఐఆర్లు నమోదు చేసి, ఒక్కొక్క కేసులో వరసగా అరెస్టు చేస్తూ, భయపెట్టడమే ధ్యేయంగా యు.పి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఈ దురుద్దేశ ప్రయత్నాన్ని గతంలో సుప్రీం కోర్టు ఎత్తిచూపినా బిజెపి పాలకులు తమ ద్వేషబుద్ధిని వదులుకోవడం లేదు. ఇటీవల మణిపూర్ అవమానవీయ సంఘటనల నేపథ్యంలోనూ అక్కడి బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది. నిందితులను పట్టుకొని శిక్షించటం కన్నా ఆ సంఘటనల గురించి దేశానికి తెలిసేలా వీడియో తీసిన వారి మీదనే తొట్టతొలిగా విరుచుకుపడింది. హత్య చేయడం కన్నా ఆ హత్యను చూసి, 'అయ్యో పాపం' అనటమే మహాపరాధం అన్నట్టుగా కమలనాథుల ధర్మం అఘోరిస్తోంది.

ఏ వేదిక మీదైనా, ఏ రూపంలోనైనా బాలల్లో కుల మతోన్మాదాలను, వివక్షా విషబీజాలను నాటే వ్యక్తులను, సంస్థలను ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించాలి. మానవ సమాజం ఉన్నతంగా, ఉత్తమంగా పరిఢవిల్లాలంటే- స్వేచ్ఛ, సమానత్వం, సామరస్యం, సుహృద్భావం వెల్లివిరియాలి. నేహా పబ్లిక్ స్కూల్లో జరిగిన సంఘటన ఈ దేశ సహృదయులను ఎంతగా కలచివేసిందో- ఆ తరువాతి రోజు రైతు సంఘం నాయకులు, కొందరు గ్రామస్తులూ కలిసి, ఆ బాలురను కలగలిపి ఒకరినొకరు ఆలింగనం చేసుకునేలా సామరస్యం సమకూర్చిన దృశ్యం అంతగా ఆనందపరిచింది. ఇది కదా, మన దేశ సమైక్య సామరస్య సౌభ్రాతృత్వ సంస్కృతి అనిపించింది!

మంచి మాట




పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇప్పుడు మనం ఎదుర్కొంటున్నది కేవలం ప్రపంచ ఆర్థిక సంక్షోభం, దాని పర్యవసానంగా వచ్చే సామాజిక పరిణామాలు మాత్రమే కాదు. భయంకరమైన ఆకలి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం.

- డా॥ హన్నా మిడిల్‌టన్,
ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి.

అంతర్జాతీయం

బ్రిక్స్ సదస్సు ధనిక దేశాలకు హెచ్చరిక !



ఎం. కోటేశ్వరరావు

ఆగస్టు 22 నుంచి 24వ తేదీ వరకు దక్షిణాఫ్రికా నగరమైన జోహానెస్‌బర్గ్‌లో "బ్రిక్స్ (బిఆర్ఐసిఎస్)" కూటమి (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) పదిహేనవ శిఖరాగ్ర సమావేశం జయప్రదంగా ముగిసింది. అర్జెంటీనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను ఈ కూటమిలో చేరాల్సిందిగా ఆహ్వానం పలికారు. వాటికి అంగీకారమైతే 2024 జనవరి ఒకటవ తేదీ నుంచి పూర్తి స్థాయి సభ్యులుగా పరిగణిస్తారు. న్యూయార్క్ లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో 2006లో జరిగిన ఒక సమావేశంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడిన ఆర్థిక కూటమిని బ్రిక్ అని పిలిచారు. తరువాత 2010లో దక్షిణాఫ్రికా చేరటంతో అది బ్రిక్స్‌గా మారింది. ఇప్పుడు విస్తరణ బాటలో ఉన్నందున బ్రిక్స్ ప్లస్ అంటారా లేక మరేదైనా పేరు పెడతారా అన్నది చూడాల్సి ఉంది. బ్రిక్ లేదా బ్రిక్స్ కూటమి అని పేరు పెట్టటానికి గోల్డ్‌మన్ శాచస్ కంపెనీ ఆర్థికవేత్త జిమ్ ఓ నెయిల్ చేసిన వర్ణన ప్రేరణ అని చెబుతారు. ఇలాంటి కూటమి ఏర్పడితే అది 2050 నాటికి ప్రపంచ ఆర్థిక రంగంలో మిగతా వాటిని వెనక్కు నెడుతుందని 2001లో జోశ్యం చెప్పాడు. బ్రిక్స్ విస్తరణ, దాని తీరుతెన్నులను చూస్తే అంతకంటే ముందే దాని ప్రభావం వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిదానమే ప్రధానం అన్నట్లుగా ముందుకు పోతున్న ఈ కూటమి నేడు పశ్చిమ దేశాల పెత్తనం, తంటాలమారితనాన్ని ఎదుర్కొనే దిశగా ఉంది. నూతన ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవస్థ కోసం చూస్తున్న ఈ కూటమి నడక నల్లేరు మీద బండిలా ఎలాంటి కుదుపులు లేకుండా సాగుతుందని చెప్పలేము. ఈ సమావేశాల్లో లూలా డసిల్వా (బ్రెజిల్), సెర్గీలావరోవ్ (రష్యా విదేశాంగ మంత్రి), నరేంద్ర మోడీ (ఇండియా), సీ జిన్‌పింగ్ (చైనా), సిరిల్ రమాఫోసా (దక్షిణాఫ్రికా) పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మీద అంతర్జాతీయ కోర్టు వారెంటు జారీ చేసింది. ఆ కోర్టును రష్యా అంగీకరించలేదు. బ్రిక్స్‌కు ఆతిథ్యం ఇస్తున్న దక్షిణాఫ్రికా కోర్టు ఒప్పందంలో సభ్యురాలిగా ఉన్నందున తలెత్తే పరిస్థితి కారణంగా పుతిన్ హాజరు కాలేదు.

పారిశ్రామిక, సరఫరా గొలుసు నుంచి విడగొట్టుకోవాలి. విచ్ఛిన్నం, ఆర్థిక బలవంతం చేయాలని చూస్తున్న శక్తుల చర్యలను అడ్డుకోవాలని, చైనా అధినేత సీ జిన్‌పింగ్ తాజా సమావేశంలో పిలుపునిచ్చారు. ఇదే తరుణంలో డిజిటల్ ఎకానమీ, హరిత వృద్ధి, సరఫరా వ్యవస్థల వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారం అందించుకోవాలని కోరారు. అంతర్జాతీయ రంగంలో పెద్ద గొంతులేసుకొని, కండల ప్రదర్శనలతో తమ స్వంత నిబంధనలను రుద్దాలని చూస్తున్నవారి తీరు ఆమోదం కాదని, ఐరాస నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఒక దేశం- ఒక కూటమి పెత్తనం లేకుండా ముందుకు వస్తున్న బహుళధ్రువ ప్రపంచం, సాంప్రదాయక విలువలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నూతన ఉదారవాద విధానాలు ముప్పు తెస్తున్నట్లు వీడియో ద్వారా పుతిన్ చేసిన ప్రసంగంలో పేర్కొన్నాడు. అమెరికా పేరు పెట్టకుండా దాని గురించే మాట్లాడినట్లు విశ్లేషకులు టీకా తాత్పర్యం చెప్పారు. పశ్చిమ దేశాలు బ్రిక్స్ కూటమి తమకు ముప్పుగానూ, జి-7కు పోటీగా దాన్ని మార్చేందుకు చైనా చూస్తున్నదనే అనుమానాలు పశ్చిమ దేశాల్లో రోజు రోజుకూ పెరుగుతున్నాయి. విస్తరణలో భాగంగా చేరుతున్న దేశాలు కూడా పశ్చిమ దేశాల బాధితులే కావటం గమనించాల్సిన అంశం. ప్రపంచంలో ఏ దేశమూ గతంలో మాదిరి ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణంలో నడవాలని కోరుకోవటం లేదు.



విచ్ఛిన్నం, ఆర్థిక బలవంతం చేయాలని చూస్తున్న శక్తుల చర్యలను అడ్డుకోవాలని, చైనా అధినేత సీ జిన్‌పింగ్ తాజా సమావేశంలో పిలుపునిచ్చారు. ఇదే తరుణంలో డిజిటల్ ఎకానమీ, హరిత వృద్ధి, సరఫరా వ్యవస్థల వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారం అందించుకోవాలని కోరారు. అంతర్జాతీయ రంగంలో పెద్ద గొంతులేసుకొని, కండల ప్రదర్శనలతో తమ స్వంత నిబంధనలను రుద్దాలని చూస్తున్నవారి తీరు ఆమోదం కాదని, ఐరాస నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.

బ్రిక్స్ దేశాల్లోని జనాభా 2022 లెక్కల ప్రకారం 324 కోట్ల మంది, అంటే ప్రపంచంలో నలభై శాతం మంది. భారత్, చైనాల్లోనే 382 కోట్ల మంది ఉండగా మిగిలిన మూడింటిలో 42 కోట్ల మంది ఉన్నారు. ప్రపంచ సాధారణ జిడిపిలో ఈ కూటమి వాటా 2000లో 11.74 శాతం కాగా పదేళ్లలో 17.95, 2022 నాటికి 26 శాతానికి పెరిగింది. అదే పిపిపి పద్ధతిలో చూస్తే 31.5 శాతానికి పెరిగి జి-7 దేశాల 30 శాతాన్ని దాటింది. 2028 నాటికే బ్రిక్స్ వాటా 50 శాతం దాటనుందని అంచనా. ఐఎంఎఫ్ సమాచారం ప్రకారం 2000 సంవత్సరం నుంచి 2022కు చూస్తే జనాభా వాటా 43.92 నుంచి 41.42 శాతానికి తగ్గింది. ప్రపంచ ఎగుమతుల్లో వాటా 8.2 నుంచి 18, ప్రపంచ వాణిజ్యంలో 7.51 నుంచి 18 శాతానికి, విదేశీ మారకద్రవ్య నిల్వ 281.2 నుంచి 4,581 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఆంక్టాడ్ 2023 గణాంకాల ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 2001-2021 కాలంలో 84 నుంచి 355 బి.డాలర్లకు పెరిగాయి. ఈ మొత్తంలో చైనా వాటా సగానికి పైగా ఉంది. ఒక్క జనాభాలో భారత్ ప్రథమ స్థానంలో ఉండటం తప్ప మిగిలిన అన్ని అంశాలలో చైనా ఎంతో ఎత్తున ఉంది.

జోహానెస్‌బర్గ్ శిఖరాగ్ర సభలో మొత్తంగా భిన్న నేపథ్యాల పూర్వరంగంలో దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, ప్రపంచ సమస్యలపై ఏకీభావం సాధించేందుకు సంప్రదింపులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సంకల్పం వెల్లడైంది. సమీకృత అభివృద్ధి, ప్రపంచ సవాళ్లు, దేశాల మధ్య సంబంధాలను పటిష్టపరుచుకోవాలన్న వాంఛను నేతలు వెలిబుచ్చారు. సభ జరిగింది ఆఫ్రికా ఖండంలో గనుక సహజంగానే దాని ఇతివృత్తానికి కేంద్ర స్థానం లభించింది. ప్రపంచ పేద దేశాలు ప్రత్యేకించి ఆఫ్రికా దేశాలతో సంబంధాలు, సహకారం గురించి నేతలందరూ మాట్లాడారు. ఈ సభకు పుతిన్ రాకపోవటం గురించి పశ్చిమ దేశాల్లో ఇంకేముంది బ్రిక్స్‌లో విబేధాలు, రష్యా పలుకుబడికి గండిపడింది అన్నట్లుగా విశ్లేషణలను వండివార్చారు. ముందే చెప్పుకున్నట్లు ఆతిథ్య దేశాన్ని ఇరకాటంలో పెట్టకూడదన్న పరిణితి పుతిన్, ఇతర దేశాధినేతల్లో వెల్లడైంది. స్వయంగా హాజరు బదులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొని నిర్ణయాల్లో భాగస్వామి అయ్యారు. బ్రిక్స్‌ను విస్తరించాలన్న ఆలోచన కొత్తగా వచ్చింది కాదు. 2013లో దక్షిణాఫ్రికా అధ్యక్ష స్థానంలో ఉన్నపుడు ఆఫ్రికా యూనియన్‌కు స్థానం కల్పించాలని కోరింది. తరువాత 2017లో బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్‌తో పాటు ఇతర దేశాలు) అన్న భావనను చైనా ముందుకు తెచ్చింది. తమకు సభ్యత్వం ఇవ్వాలని ఇరాన్, అర్జెంటీనా దరఖాస్తు చేసుకోవటంతో 2022లో బ్రిక్స్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మొత్తం నలభై దేశాలు ఆసక్తి వెల్లడించటంతో పాటు 23 లాంఛనంగా దరఖాస్తు చేశాయి. వాటిని పరిశీలించి పైన పేర్కొన్న ఆరు దేశాలకు వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి పూర్తి స్థాయి సభ్యత్వం ఇచ్చేందుకు నిర్ణయించారు.

ప్రపంచ జనాభాలో ఈ కూటమి దేశాల్లో 46.5 శాతానికి, జిడిపి 30 శాతానికి పెరగనుంది. విస్తరణతో ఈ కూటమి దేశాల చమురు వాటా ప్రపంచంలో 20.4 నుంచి 43.1 శాతానికి పెరగనుంది. ప్రపంచ సహజ వాయువులో 30 శాతం కలిగి ఉన్నాయి, ప్రపంచ చమురు ఎగుమతుల్లో వాటా 18 నుంచి 25.1 శాతానికి పెరగనుంది. ప్రపంచ ఆర్థిక రంగం మీద పెత్తనం చేస్తున్న డాలరును వెనక్కు నెట్టి బ్రిక్స్ కరెన్సీని ప్రవేశపెట్టాలన్న ఆలోచన మీద కూడా జోహానెస్‌బర్గ్ సమావేశాల్లో చర్చ జరిగింది. కొన్ని దేశాల సందేహాల కారణంగా ముందుకు పోలేదు. ఉమ్మడి కరెన్సీని పంచుకోవటం గురించి బ్రెజిల్ ప్రతిపాదన ముందుకు తేగా మన దేశం భిన్న వైఖరిని వెల్లడించింది. ఈ అంశం ప్రస్తుత సమావేశ ఎజెండాల్లో లేదని దక్షిణాఫ్రికా పేర్కొన్నది. డాలర్లకు బదులు ఆయా దేశాల కరెన్సీలతో లావాదేవీలు జరపాలని చైనా, రష్యా పేర్కొన్నాయి. అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న ఈ దేశాలు సహజంగా డాలరును వ్యతిరేకిస్తున్నాయి. డాలర్లలో లావాదేవీల వాటా 2015లో వాటి వాటా 90 శాతం ఉండగా 2020 నాటికి 46 శాతానికి, తరువాత ఇంకా తగ్గింది. మన దేశం మాత్రం ఎగుమతులు-దిగుమతులకు 80 శాతం డాలర్లనే వాడుతున్నది.

ప్రస్తుత విస్తరణ, రానున్న రోజుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న దేశాల పెరుగుదలను చూసినపుడు ప్రపంచ బలాబలాల్లో ఈ కూటమి కీలకంగా మారనున్నదనేది స్పష్టం. మన దేశం, చైనాతో సహా మిగిలిన దేశాలన్నీ బహుముఖ ప్రపంచ వ్యవస్థ ఉండాలని కోరుతున్నాయి. ఈ కూటమిలో ఉన్న దేశాల ఆర్థిక రంగాలను చూసినపుడు తేడా చాలా ఎక్కువగా ఉంది. అందువలన వాటి ప్రయోజనాలు, ప్రాధాన్యతలు కూడా వేరుగా ఉంటాయి. ఉదాహరణకు మన దేశం చైనాను అధిగమించాలని చూస్తున్నట్లు బహిరంగంగానే వాంఛ వెల్లడిస్తున్నది. వివాదాస్పద అంశాలపై కూడా ఈ కూటమిలో పూర్తి ఏకీభావం లేనందున అంగీకృత అంశాల మీదనే కేంద్రీకరణ జరుగుతున్నది. ఇండో-పసిఫిక్ పేరుతో చైనా వ్యతిరేక కూటమి నిర్మాణానికి పూనుకున్న అమెరికాకు దక్షిణ చైనా సముద్రంలో స్వేచ్ఛగా నౌకలు తిరిగేందుకు అవకాశం ఉండాలంటూ మన దేశం మద్దతు ఇస్తున్నది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను సమర్థించనప్పటికీ అమెరికాకు ఆగ్రహం కలగకుండా ఇరాన్ నుంచి చమురు కొనుగోలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఒక విధంగా చెప్పాలంటే ఎవరికీ నొప్పి తగలకూడదనే వైఖరితో మన దేశం గడసాము గారడీలు చేస్తున్నది.

లండన్‌లోని సోయాజ్ చైనా సంస్థ డైరెక్టర్ స్టీవ్ సాంగ్ మాట్లాడుతూ బ్రిక్స్ సభ్యదేశాలు ఉపరితలంతో ఒకేవిధంగా లేవని, అయినప్పటికీ ఎవరూ పశ్చిమ దేశాల ఆధిపత్య ప్రపంచంలో జీవించకూడదని అందరూ అనుకుంటున్నట్లుగా చూపేందుకు సీ జిన్‌పింగ్ చూశారని, చైనా వారు చూపుతున్న ప్రత్యామ్నాయంలో నిరంకుశులు తమ స్వంత దేశాల్లో సురక్షితంగా ఉండవచ్చని, ప్రజాస్వామిక అమెరికా, ఐరోపా దేశాలు రుద్దిన షరతులను అంగీకరించకుండా ప్రత్యామ్నాయ అభివృద్ధి పథాన్ని కనుగొనవచ్చనే భావన ఉన్నదని అన్నాడు. తమకు గానీ మరొక దేశానికి గానీ ప్రత్యర్థిగా రాజకీయ ప్రత్యర్థి తయారవుతున్నట్లుగా తాము భావించటం లేదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులవాన్ సమావేశ ప్రాధాన్యతను తక్కువ చేసి చూపేందుకు, వక్రీకరించేందుకు చూశారు. కొత్తగా బ్రిక్స్‌లో చేరిన ఆరు దేశాల్లో ఏ ఒక్కటీ అమెరికా వ్యతిరేకమైనది లేదని వాషింగ్టన్ లోని క్విన్సీ సంస్థ డైరెక్టర్ సరంగ్ షిడోర్ అన్నాడు. ఈ సమావేశాల తరువాత పశ్చిమ దేశాలకు చెందిన విశ్లేషకులు, మీడియా వార్తల తీరు వక్రీకరణ, కూటమిలో అనుమానాలను రేకెత్తించేదిగా, తంపులు పెట్టేదిగా ఉందని చెప్పవచ్చు. ★

సందర్భం

రక్ష (?) - బంధనం

ఎం.వి.ఎస్. శర్మ


దేశంలో మళ్ళీ రాఖీ పండుగ జరుపుకోబోతున్నారు. అత్యధికులు ఈ రాఖీ పండుగ అనేది అన్నాచెల్లెళ్ళ బంధానికి, లేదా అక్క తమ్ముళ్ళ బంధానికి ఒక ప్రతీకగా పరిగణిస్తున్నారు. అందులో అభ్యంతరం పెట్టవలసినది ఏమీ లేదు. ఐతే "భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సోదరీసోదరులు...." అంటూ సాగే మన స్కూలు విద్యార్థుల ప్రతిజ్ఞ (ఇది ప్రతి రోజూ స్కూళ్ళలో జరుపుతారు) కులాలకు, మతాలకు అతీతంగా ఉన్న ప్రతిజ్ఞ. ఐతే చాలా అరుదుగా మాత్రమే భిన్న మతాలకు చెందిన వారితో కలిసి రాఖీ పండుగ జరుపుతారు.

ఇటీవల మణిపూర్‌లో జరిగిన అత్యంత విషాదకరమైన సంఘటనలు, ఇంకా కొనసాగుతున్న దాడులు ఒక ప్రత్యేకతను కలిగివున్నాయి. ఈ దాడులను మణిపూర్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం జమిలిగా దగ్గరుండి ప్రోత్సహించిన దాడులు. రాష్ట్ర పోలీసులు, కేంద్ర రిజర్వు ఆర్మీ దగ్గరుండి దాడులను పర్యవేక్షించాయి. కాని సుప్రీం కోర్టు గట్టిగా మందలించిన తర్వాత మాత్రమే మోడీ నామమాత్రంగా తన విచారాన్ని వ్యక్తం చేశారు. ఐతే, ఇప్పటికీ మణిపూర్ వెళ్ళడానికి ఆయనగారికి తీరుబాటు దొరకలేదు. పార్లమెంట్‌లో ఆ దుర్ఘటనలను ప్రస్తావించడానికి ఆయనకు నోరు రాలేదు.

ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ఇంకా బిజెపి శ్రేణులు, ఆరెస్సెస్ గణాలు, బజరంగ్‌దళ్ బృందాలు, గోరక్షకులు, ఇంకా ఇంకా చాలా దళాలు రాఖీ పండుగను మాత్రం పెద్ద ఎత్తున జరుపుకోవడం ఖాయం. ముస్లిం పురుషుల "దుర్మార్గాల" నుండి హిందూ స్త్రీలను కాపాడుకోవడం కోసమే ఈ పండుగ వచ్చిందని ఒక ప్రచారం కూడా చేస్తూంటారు. 2002 లో గుజరాత్‌లో 3000 మంది ముస్లింలు నరమేథానికి బలైపోయిన సంగతి అందరికీ తెలుసు. అలా బలైనవారిలో అత్యధికులు మహిళలే. వారిని బలి తీసుకున్నది, అత్యాచారాలకు పాల్పడినది ఎవరు? హిందూత్వ దుండగులు కాదా? హిందూ మహిళలకు అవసరమైన రక్షణ తక్కిన మతాల మహిళలకు అక్కరలేదా?

గత దశాబ్ద కాలంలో, ముఖ్యంగా మోడీ, యోగి ల డబుల్ ఇంజన్ సర్కారు హయాంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహిళలపై సాగించిన అత్యాచారాలు లెక్కలేనన్ని ఉన్నాయి. అత్యాచారాలకు బలైనవారిలో అత్యధికులు హిందూ మహిళలే (ముఖ్యంగా దళిత, బి.సి., గిరిజన తరగతులకు చెందినవారు). మరి ఈ మహిళలందరూ గతంలో తమ సోదరులకు రాఖీలు కట్టివుంటారు. ఐనా వారికి రక్షణ ఎందుకు కరువైంది?

వెనకటికి ఒక అమాయకురాలైన మహిళ (పెద్ద కులానికి చెందిన మహిళ) తన ఇంటి పెరట్లో కొబ్బరి చెట్టుకు కాసిన బొండాలను ఎవరో దొంగలు ఎత్తుకుపోతున్నారని గమనించింది. తాను ధరించే మడిబట్టను ఎవరూ తాకరాదు గనుక అటువంటి ఒక మడిబట్టనే ఆ కొబ్బరి చెట్టుకు గనుక కడితే మడిబట్టను తాకకూడదు గనుక దొంగ వెనక్కిపోతాడని, తన చెట్టు కాపు భద్రంగా ఉంటుందని అనుకుందామె. ఆ విధంగానే ఒక మడిబట్టను కొబ్బరి చెట్టుకు కట్టింది. ఆ రాత్రి దొంగ రానే వచ్చాడు. కొబ్బరి బొండాలను జాగ్రత్తగా చప్పుడు చేయకుండా దింపాడు. ఆ మడిబట్టలోనే వాటినన్నింటినీ మూటగట్టాడు. చల్లగా జారుకున్నాడు.




రాఖీ కట్టినంత మాత్రాన ఈ అగ్రవర్ణ, పురుషాధిక్య సమాజంలో, ముఖ్యంగా మనువాదాన్ని ప్రచారం చేసుకునే హిందూత్వ శక్తుల పాలనలో మహిళలకు రక్షణ దొరుకుతుందని నమ్మితే, మనదీ కొబ్బరి చెట్టుకు మడిబట్ట కట్టిన అమాయకురాలి గతే అవుతుంది. స్త్రీ చిన్న తనంలో తండ్రి రక్షణలో, వయస్సులో ఉన్నప్పుడు భర్త రక్షణలో, వృద్ధాప్యంలో కొడుకు రక్షణలో ఉండాలని మనువాదం చెప్పింది. స్త్రీకి స్వాతంత్ర్యం ఉండకూడదని నొక్కి చెప్పింది. ఎక్కడా స్త్రీలు తమను తాము కాపాడుకునేవిధంగా బలవంతులుగా తయారుకావాలని చెప్పలేదు. ఆరెస్సెస్ శాఖలు హిందూ స్త్రీలకు ఇతర మతాల వారి నుండి ప్రమాదం ఉందని పదే పదే చెప్తూనే వుంటాయి. కాని ఎక్కడా, ఎప్పుడూ ఆ స్త్రీలు తమ ఆత్మరక్షణ కోసం బలంగా ప్రతిఘటించే శక్తియుక్తులు సంపాదించుకోవాలని చెప్పవు. అటువంటి శిక్షణనూ ఇవ్వవు.

రాఖీ పండుగ నాడు కూడా అభ్యుదయ శక్తులు...కులాలతో, మతాలతో నిమిత్తం లేకుండా అందరూ దోపిడీ నుండి, పురుషాధిక్యత నుండి విముక్తికి ప్రతిన పూనుతూ రాఖీ కార్యక్రమం నిర్వహించవచ్చు. గతంలో యువజన, మహిళా సంఘాలు సంయుక్తంగా ఈ తరహా కార్యక్రమాలు దేశ సమైక్యతకు ప్రమాదం వాటిల్లిన సందర్భాలలో నిర్వహించాయి. హిందూత్వ శక్తులు పురుషాధిక్యతను, విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు ఈ పండుగను వాడుకుంటాయి. దానికి భిన్నంగా మహిళా విముక్తి లక్ష్యంగా, లౌకిక సమైక్యతతో, పోరాట స్ఫూర్తితో అభ్యుదయ ఉద్యమాలు ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలి .

పురుషాధిక్యత, హిందూత్వ విద్వేష ప్రచారం, ఆడదానిని ఒక సరుకుగా పరిగణించే నయ ఉదారవాద వినిమయ తత్వం నేటి భారతీయ మహిళలపై ముప్పేట దాడిని చేస్తున్నాయి. ఈ మూడు వైపుల దాడినీ మొత్తం సమాజం యావత్తూ ఐక్యంగా ప్రతిఘటిస్తే తప్ప స్త్రీలకు రక్షణ ఉండదు. అటువంటి ఐక్యతకు, ప్రజలు తమ విముక్తి కోసం సాగించే పోరాటాలకు విడదీయలేని బంధం ఉంది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటపు అనుభవాలు ఆ విషయాన్ని మనకు స్పష్టం చేస్తాయి. వెట్టి నుండి విముక్తి సాధించడానికి చేసిన పోరాటమే తెలంగాణ రైతు మహిళలను భూస్వాముల అత్యాచారాల నుండి విముక్తి చేసింది. ఆ పోరాటంలో మహిళలు ఎంత వీరోచితంగా పోరాడారో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అనుభవాలు మనకు తెలియజెప్తాయి. మహారాష్ట్ర ఆదివాసీల తిరుగుబాటు (గోదావరి లోయ ఆదివాసుల పోరాటం) వీర వనిత గోదావరి పెరులేకర్ నాయకత్వంలో నడిచింది. ఈ తరహా ఉద్యమాలు స్త్రీలలో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. మరొకవైపు పురుషులలో మహిళల పట్ల గౌరవాభిమానాలను, మర్యాదను పెంచాయి. అటువంటి ఉద్యమాలను ఐక్యంగా నిర్వహించడానికి సంకేతంగా ఏదైనా పండుగ జరుపుకుంటే అర్థం చేసుకోవచ్చు. రాఖీ పండుగ నాడు కూడా అభ్యుదయ శక్తులు...కులాలతో, మతాలతో నిమిత్తం లేకుండా అందరూ దోపిడీ నుండి, పురుషాధిక్యత నుండి విముక్తికి ప్రతిన పూనుతూ రాఖీ కార్యక్రమం నిర్వహించవచ్చు. గతంలో యువజన, మహిళా సంఘాలు సంయుక్తంగా ఈ తరహా కార్యక్రమాలు దేశ సమైక్యతకు ప్రమాదం వాటిల్లిన సందర్భాలలో నిర్వహించాయి. హిందూత్వ శక్తులు పురుషాధిక్యతను, విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు ఈ పండుగను వాడుకుంటాయి. దానికి భిన్నంగా మహిళా విముక్తి లక్ష్యంగా, లౌకిక సమైక్యతతో, పోరాట స్ఫూర్తితో అభ్యుదయ ఉద్యమాలు ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలి . ★

రాఖీ ఆచారం - పూర్వాపరాలు

హిందువులలో ప్రజల బహిరంగ జీవితం లోకి మతం జొరబడడం వెనుక రెండు పార్శ్వాలు ఉన్నాయి. మొదటిది: అగ్రవర్ణాల ఆచార వ్యవహారాలను తక్కిన అన్ని కులాల హిందువులలోకీ చొప్పించడం ద్వారా తమ ఆధిపత్య సంస్కృతిని అగ్రవర్ణాలు సాధించడం. రెండవది: దేశ ప్రజా జీవితంలోకి మతాచారాలను ప్రవేశపెట్టి తద్వారా మతపరమైన కార్యకలాపా లను దేశ ప్రజల జాతీయ కార్యకలాపాలుగా మార్చివేయడం. ఒక మతానికి చెందిన వివిధ వర్గాల ప్రజలు ఉన్నప్పటికీ, వారిలో కొందరు తక్కినవారిని దోపిడీ చేస్తున్నప్పటికీ, ఆ మత ప్రజలంతా ఐక్యంగా ఉన్నారన్న భావన కలిగించడం.



రక్షాబంధన్ పండుగను ఒక జాతీయ ఉత్సవం లాగా బహిరంగంగా నిర్వహించడం వెనుక ఆరెస్సెస్ అసలు ఉద్దేశ్యం ఇదే. రక్షాబంధన్‌ను అందరూ రాఖీ పండగ అని అంటారు. ఇది సోదరీ సోదరుల మధ్య బంధాన్ని బలపరుస్తుంది. ఇప్పటికీ దాని మూల స్వభావం అదే. ఈ ఆచారం పితృస్వామిక సమాజంలో వచ్చింది. ఆ సమాజంలో స్త్రీ భర్త ఇంట్లో ఉంటుంది. తన పుట్టింట్లో ఎటువంటి ఆస్తిపైనా ఆమెకు హక్కు ఉండదు. తన రక్త బంధువులను కలుసుకునే ఒక సందర్భంగా రాఖీ పండుగ ఆమెకు ఉపయోగపడుతుంది. కేరళ సమాజంలో చాలా కాలం మాతృస్వామిక వ్యవస్థ కొనసాగింది. బహుశా అందుకే అక్కడ రాఖీ పండుగ ఒక సామాజిక ఆచారం రూపం తీసుకోనేలేదు.

రాఖీ పండుగలో రక్షణ కల్పించడం అనే భావన బహుశా మధ్య యుగాలలో వచ్చి చేరివుండాలి. ఆ సమాజంలో మహిళను తమ ఇంటిపరువుకు సంకేతంగా పరిగణిస్తారు. అందుకే సోదరీ సోదరుల మధ్య అభిమానానికి గుర్తుగా మొదలైన పండుగ కాస్తా మహిళలకు రక్షణ కల్పించడానికి సంకేతంగా మారిపోయింది.

ఐతే ఈ ఆచారం అగ్రకులాల కుటుంబాలకు మాత్రమే పరిమితంగా ఉండేది. శ్రామిక వర్గ ప్రజల, కులాల కుటుంబాలలో ఈ ఆచారం ఉండేది కాదు పైగా దీనిని ఒక బహిరంగ వేడుకగా పాటించేవారు కాదు. కొన్ని ప్రాంతాలకు, కొన్ని కులాలకు మాత్రమే ఇది పరిమితంగా ఉండేది.

రాఖీ పండుగను ఒక ఉత్సవంగా పాటించాలని ఎబివిపి ఒక కరపత్రం ద్వారా ప్రచారం చేసింది. దక్షిణాది రాష్ట్రాలలో అంతకు మునుపు దీనిని పండుగగా జరిపుకునేవారు కాదు. ఉత్తరాదిలో సైతం అంతకు ముందు ఇది కొద్దిపాటి అగ్ర కులాలవారికే పరిమితం. చాలామంది దళితులు దక్షిణాదిలో ఈ పండుగను జరపరు. కాని ఆరెస్సెస్ శక్తులు ఈ సందర్భాన్ని తమ వ్యూహాన్ని అమలు చేయడానికి ఒక సాధనంగా వాడుకోసాగాయి. తద్వారా ఒకవైపు పితృస్వామిక భావజాలాన్నీ బలపరచగలుగుతున్నాయి, మరోపక్క తమ సాంస్కృతిక జాతీయవాద భావజాలాన్ని ప్రచారం చేసుకోగలుగుతున్నాయి.

- ప్రొ. కె.ఎన్. పణిక్కర్

జనవాక్యం

సమాఖ్య సూత్రాలకు విరుద్ధం

మొన్న 23వ తేదీన చంద్రునిపై చంద్రయాన్-3 దిగిన ప్రాంతానికి మోడీ గారు "శివశక్తి" అని పేరు పెట్టడం అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య సూత్రాలకు విరుద్ధం. సౌర వ్యవస్థలో దేనికైనా కొత్తగా నామకరణం చెయ్యాలంట ే...ఆ పేర్లు అంతర్జాతీయంగా తెలిసినవై ఉండాలి. చంద్రయాన్ దిగిన చోటుకి అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య సూచనలకు, సిఫార్సులకు లోబడి వుండాలి. రాజకీయ, మిలటరీ, మత సంబంధమైన పేర్లు పెట్టకూడదు. అంతర్జాతీయ స్థాయికి చెందిన వారి పేర్లు గ్రహశకలాలు వాడవచ్చు. ఈ సమాఖ్య సూత్రాలలోని ఏడవ అంశంలో 19వ శతాబ్దపు నాయకుల పేర్లు తప్ప, రాజకీయ, సైనిక సంభందమైన, మత సంబంధమైన పేర్లు పెట్టరాదని అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య వారి నియమ నిబంధనలలో స్పష్టంగా ఉంది. అయినప్పటికీ ఒక మతానికి చెందిన 'శివశక్తి' పేరు ప్రధాని పెట్టడం సైన్సును అపహస్యం చెయ్యటమే అవుతుంది. కనుక తక్షణమె శివశక్తి పేరును తీసేసి అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య సూత్రాలకు అనుగుణమైన పేరు పెట్టాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి. హేతువాదసంఘం అధ్యక్షుడు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

అదానీకి అంత సీన్ ఉందా?

- ధారవి వాసుల అనుమానాలు
- న్యాయ పోరాటానికి సిద్ధమైన ప్రత్యర్థి బిడ్డర్



ముంబయి : ఆసియాలోనే అతి పెద్దదైన ముంబయి మురికివాడ ధారవిలో నివసిస్తున్న పది లక్షల మంది ప్రజలకు గృహ వసతి కల్పించి, వారి జీవితాలలో వెలుగులు నింపుతానంటూ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ చేసిన ప్రకటనపై అక్కడి పేదలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారంలో ఎదురు దెబ్బలు, ఆరోపణల నేపథ్యంలో అదానీ ఆర్థిక పరిస్థితి అంచనా వేస్తున్న ప్రజలు ఆయనకు ఆ సామర్థ్యం ఉన్నదా అని ప్రశ్నిస్తున్నారు.

అదానీ అభివృద్ధి చేస్తానని చెబుతున్న ధారవి మురికివాడలో నివసిస్తున్న పేదలు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. అక్కడ డ్రైనేజ్ వ్యవస్థ లేదు. సామూహిక మరుగు దొడ్లలోనే కాలకృత్యాలు తీర్చుకుంటారు. ఈ మురికివాడ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి, ఆకాశ హర్మ్యాలలో కార్యాలయాలను నిర్వహిస్తున్న విదేశీ కంపెనీలకు చేరువలో ఉంది. అయినా ప్రజల జీవనం అస్తవ్యస్తం. మురికివాడను పునర్నిర్మించే లక్ష్యంతో మహారాష్ట్ర ప్రభుత్వం జులైలో 614 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును ఖరారు చేసింది. ఆ వెంటనే తాను ఆ మురికివాడను స్వర్గధామంగా మారుస్తానని అదానీ ప్రకటించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న పేదల ఇళ్లను కూల్చివేసి ప్రభుత్వ భూమిలో కొత్తగా టవర్లు నిర్మిస్తామని, వాటిని ప్రజల నివాసాలకు, వ్యాపారాలకు కేటాయిస్తామని అదానీ చెబుతున్నారు. దీనిపై ఆయన 12 బిలియన్ డాలర్లు ఖర్చు చేసి, 24 బిలియన్ డాలర్ల లబ్ధిచేలా అభివృద్ధి హక్కులు పొందుతారని కన్సల్టెన్సీ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

అయితే ప్రస్తుతం అదానీ ఆర్థిక పరిస్థితి అంత సజావుగా లేదు. జనవరి వరకూ ఆయన ప్రపంచ సంపన్నుల జాబితాలో మూడో స్థానంలో ఉన్నారు. అయితే హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఆయన వ్యాపార సామ్రాజ్యం బీటలు వారింది. అదానీ గ్రూప్ మార్కెట్ విలువ ఒక్కసారిగా 150 బిలియన్ డాలర్లు పడిపోయింది. ఇదే తమను ఆందోళనకు గురి చేస్తోందని ధారవి వాసులు తెలిపారు. దీనికితోడు పులి మీద పుట్రలా అదానీతో పాటు ధారవి కోసం బిడ్ వేసిన దుబాయికి చెందిన కన్సార్టియం సెకలింక్ టెక్నాలజీస్ కార్పొరేషన్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతోంది. 2018లోనే తాము ధారవి పునర్నిర్మాణానికి అత్యధిక బిడ్ వేశామని, అయితే 2022లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రక్రియను తిరిగి ప్రారంభించి అదానీ గ్రూపుకు కాంట్రాక్ట్ కట్టబెట్టేలా నిబంధనలు మార్చిందని ఆ సంస్థ ఆరోపించింది. ఈ కేసులో ప్రభుత్వంతో పాటు అదానీని కూడా ప్రతివాదిగా చేర్చేందుకు గత నెలలో ముంబయి కోర్టు అనుమతించింది. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన బిడ్డింగ్ ప్రక్రియ రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని, అదానీ గ్రూపు ప్రయోజనం చేకూర్చేలా నిబంధనలు మార్చిందని కన్సార్టియం ఆరోపిస్తోంది. బిడ్ దాఖలు చేసే కంపెనీ కనీస నికర విలువను రెట్టింపు చేసి 2.4 బిలియన్ డాలర్లకు పెంచారని, కన్సార్టియం సభ్యుల సంఖ్యను ఎనిమిది నుండి రెండుకు కుదించారని చెబుతోంది. అయితే ఈ ఆరోపణలను అటు అదానీ గ్రూపు, ఇటు మహారాష్ట్ర ప్రభుత్వం ఖండిస్తున్నాయి.

చంద్రయాన్-3తో విలువైన సమాచారం

ఇస్రో పూర్వపు శాస్త్రవేత్త, ఐఐఎస్‌టి రిజిస్ట్రార్ డాక్టర్ వైవిఎన్.కృష్ణమూర్తి

ప్రజాశక్తి- భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి)

మన శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్-3తో ప్రపంచంలో ఇంతవరకు ఎవరూ సేకరించని విలువైన సమాచారం మనకు అందుబాటులోకి వస్తుందని ఇస్రో పూర్వపు శాస్త్రవేత్త, తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్, రిజిస్ట్రార్ డాక్టర్ వైవిఎన్.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులతోనూ మాట్లాడారు. చంద్రయాన్-3 హైడ్రాక్స్ మలిక్యూల్స్ వంటి ఎంతో విలువైన సమాచారాన్ని అందించిందన్నారు. ఇటువంటి సమాచారం ఇంతవరకు ప్రపంచంలో ఏ దేశమూ సేకరించలేదన్నారు. చంద్రయాన్-2 కూడా 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌లో మూన్‌ను మ్యాప్ చేసి పంపిస్తుందని చెప్పారు. ప్రధానంగా ఉష్ణోగ్రత వ్యత్యాసం వంటి సమాచారం చక్కగా అందిస్తున్నాయన్నారు. కళాశాల స్థాయిలో కూడా స్టార్టప్ ఏకో సిస్టమ్ అభివృద్ధి చేసి అధ్యాపకులు, విద్యార్థులు శాటిలైట్స్ తయారు చేసేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఎస్‌ఆర్‌కెఆర్ కళాశాల విద్యార్థులు కూడా మినీ శాటిలైట్ రూపొందించేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా వచ్చినట్లు చెప్పారు. మానవులు ఎదుర్కొంటున్న క్యాన్సర్ వంటి అనేక రుగ్మతలను గుర్తించడం, పర్యావరణ కాలుష్యం ఏ మేరకు పెరుగుతుందో తదితర అంశాలు అధ్యయనం చేసేందుకు విద్యార్థులు మినీ శాటిలైట్స్ రూపొందించవచ్చున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మకమైన ఇస్రో శాస్త్రవేత్తల్లో ఒకరైన వైవిఎన్.కృష్ణమూర్తి తమ కళాశాలకు వచ్చి విద్యార్థులకు సూచనలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు, వివిధ విభాగాల హెడ్స్ పాల్గొన్నారు.

టిటిడి బోర్డు సభ్యులుగా మరో ఇద్దరు ప్రమాణం

నేడు ఎనిమిది మంది

ప్రజాశక్తి -తిరుమల

టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా మిలింద్ కేశవ్ నర్వేకర్, సౌరభ్ బోరా మంగళవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని జేఈవో అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు. టిటిడి డిప్యూటీ జెఇఒలు లోకనాథం, గోవిందరాజన్, పేష్కార్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఎనిమిది మంది ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



రాకింగ్ రాకేష్ హీరోగా సినిమా ప్రారంభం

'జబర్‌దస్త్' షో తో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రాకింగ్ రాకేష్ హీరోగా పరిచయమవుతున్నారు. డీవోపీగా పనిచేసిన అంజి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అనన్య హీరోయిన్‌గా నటిస్తోంది. గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ పతాకంపై గరుడవేగ మేకింగ్స్ ప్రొడక్షన్ నెంబర్ 1 మంగళవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తెలంగాణ ఎంపీ (రాజ్యసభ) సంతోష్ కుమార్ క్లాప్ కొట్టారు. ఎపి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా సెల్వమణి కెమరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి తనికెళ్ళ భరణి గౌరవ దర్శకత్వం వహించగా, సాయికుమార్ మేకర్స్‌కి స్క్రిప్ట్ అందజేశారు.

'చేయూత' కోసం మండుటెండలో నిరీక్షణ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (పార్వతీపురం)

మహిళలకు ప్రతి ఏటా ప్రభుత్వ అందిస్తున్న వైఎస్ఆర్ చేయూత పథకం కోసం ఇప్పటికే జిల్లాలో అనేక మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వెరిఫికేషన్ చేయాలని పైస్థాయి అధికారులు ఇప్పటికే గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు దిశ నిర్దేశం చేసినప్పటికీ చాలామంది వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లకుండా మహిళలందరినీ సచివాలయానికి పిలిపించి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని అడ్డాపుశీల సచివాలయ పరిధిలో గల ఐదు గ్రామాల మహిళలను వెరిఫికేషన్‌కు మంగళవారం ఇక్కడకు వచ్చారు. సచివాలయానికి దూరంగా ఉన్న గ్రామాల్లోని మహిళలంతా ఒకేరోజు రావడంతో వారు నిలబడ్డానికి కూడా స్థలం లేక బయట మండుటెండలో గొడుగులు వేసుకొని నిల్చొని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ సచివాలయం పరిధిలో గల మహిళలు తమ వద్దకు వచ్చి వెరిఫికేషన్ చేయాలి కదా అని ప్రశ్నించగా సదరు వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రామాల్లో నెట్వర్క్ సమస్య ఉందని అందువల్ల వెరిఫికేషన్ ప్రక్రియను సచివాలయంలో ఉన్న వైఫై సౌకర్యం తో సులభంగా పూర్తి అవుతుందని చెప్పారు. దీంతో మహిళలంతా సచివాలయాల వద్దనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయంపై అధికారులను ప్రశ్నించగా వెరిఫికేషన్ ప్రక్రియ గ్రామాల్లోని వెళ్లి చేయాలనీ వెరిఫికేషన్ సమయంలో ఎటువంటి నెట్వర్క్, ఆన్లైన్ చేయాల్సిన పనిలేదని వివరణ ఇచ్చారు. కాగా ఇదంతా స్థానిక వెల్ఫేర్ అసిస్టెంట్ తన పని భారం తగ్గించుకోవడానికి మహిళలను ఇబ్బంది పెట్టే ఆలోచనతో కేవలం ఈ పని చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.



వెరిఫికేషన్ కోసం సచివాలయం వద్ద ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

గౌతమ్‌ను చూస్తుంటే గర్వంగా ఉంది : నమ్రత

హీరో మహేష్‌బాబు ఇప్పటికే ఎంతో మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించి తన మంచి మనసు చాటుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆదే బాటలో ఆయన కుమారుడు గౌతమ్ పయనిస్తున్నాడు. గుండె ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులను ఆసుపత్రికి వెళ్లి పలకరిస్తున్నాడు. చికిత్స తీసుకుంటున్న ఓ చిన్నారితో గౌతమ్ ఉన్న ఫొటోను నమ్రత షేర్ చేశారు. గౌతమ్‌ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులను కలవడానికి అతడు రెయిన్‌బో ఆసుపత్రికి వెళ్తాడని నమ్రత చెప్పారు. ఇప్పటివరకు ఎంతోమంది చిన్నారులకు మహేష్ ఫౌండేషన్ పేరుతో గుండె ఆపరేషన్లు చేయించినట్లు ఆమె పేర్కొన్నారు. 'ఎంబీ ఫౌండేషన్‌లో భాగమైన గౌతమ్.. చికిత్స తీసుకుంటున్న పిల్లలతో కలిసి సమయాన్ని గడుపుతాడు. క్యాన్సర్ భారిన పడిన పిల్లల్లో గుండె ధైర్యాన్ని నింపుతాడు. వాళ్ల కోసం బహుమతులు తీసుకెళ్తాడు. చిరునవ్వులను చిందించే చిన్నారులను చూసి తను ఎంతో ఆనందిస్తాడు. ఇలా చేయడం వల్ల చికిత్స తీసుకుంటున్న వారు త్వరగా కోలుకుంటుంటారు. వాళ్లకు అండగా నిలుస్తున్నందుకు గౌతమ్‌కు ధన్యవాదాలు' అని నమ్రత పేర్కొన్నారు. మహేష్ కుమార్తె సితార కూడా తన 11వ పుట్టినరోజు పురస్కరించుకుని ఇటీవల పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేసిన విషయం తెలిసిందే.



విజయ్‌లో స్టైలిష్ కామెడీ చూస్తారు



'డియర్ కామ్రేడ్' టైంలో విజయ్‌కు ఈ కథ చెప్పా. విజయ్ దేవరకొండ అప్పుడు లైగర్‌తో బిజీగా ఉన్నాడు. లవ్ కాన్సెప్ట్‌తో చాలా సినిమాలు వచ్చాయి. ఖుషి చాలా సున్నితమైన అంశం చుట్టూ తిరుగుతుంది. ఈ విషయాన్ని ట్రైలర్‌లో చూపించలేదు. ఈ సినిమాకు మ్యూజికల్ కాన్సర్ట్ సలహా ఇచ్చింది విజయ్ దేవరకొండే. ఈ సినిమాలో పాటలు నేనే రాశా. ఇది మొదటిసారేం కాదు. 'నిన్ను కోరి', 'మజిలీ', 'టక్ జగదీష్' సినిమాలకు కూడా పాటలు రాశా. హేశమ్ అబ్దుల్ వహబ్ తెలుగు సినిమాకు కొత్త. ఆయనను గైడ్ చేశా. ఇక సమంత లవ్‌స్టోరీలో నటించి చాలా కాలం అయింది. 'ఖుషి'లో వింటేజ్ సమంతను చూస్తారు. ఈ సినిమా ద్వారా విజయ్‌లోని స్టైలిష్ కామెడీ టైమింగ్‌ను చూస్తారు. సినిమాలో ఎలాంటి వల్గారిటీ ఉండదు. విజయ్‌కు 'గీతగోవిందం' లాంటి మెమొరబుల్ సినిమా ఇది. సరైన సమయంలో నా కొత్త ప్రాజెక్టుల గురించి మాట్లాడుతా' అంటున్నారు దర్శకుడు శివ నిర్వాణ.

సంక్రాంతికి 'నా సామిరంగ'



కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని నా సామిరంగ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవు తున్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మేకర్స్ ఒక గ్లింప్స్ , ఫస్ట్-లుక్ పోస్టర్ ద్వారా సినిమా టైటిల్‌ను కూడా ప్రకటించారు. ఈ చిత్రానికి 'నా సామిరంగ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఏఎన్ఆర్ కల్ట్ హిట్ 'సిపాయి చిన్నయ్య'లోని నా సామిరంగ అనే ఐకానిక్ సాంగ్. హీరో నాగార్జున ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో బీడీ తాగుతూ మాస్‌గా కనిపించారు. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించ నున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, డైలాగ్స్ అందించారు. 'నా సామిరంగ' చిత్రాన్ని 2024 సంక్రాంతికి విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. పీఆర్వో: వంశీ-శేఖర్ వ్యవహరించనున్నారు.

రజనీ స్టైల్..



రజనీకాంత్ మంగళవారం ఉదయం దక్షిణ బెంగళూరులోని జయనగర్ ప్రాంత బీఎంటీసీ డిపోను సందర్శించారు.. ఆ బస్ డిపోకు వెళ్లి బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర కార్మికులతో సెల్ఫీలను తీసుకున్నారు. సుమారు 15 నిమిషాల పాటు వారితో సంభాషించారు. ఇంతకీ రజనీకాంత్ ఆ బస్ డిపోకి ఎందుకు వెళ్లారంటే.. ఆయన నటుడు కాకముందు బీఎంటీసీలో కండక్టర్‌గా పనిచేసారు. బస్‌లో స్టైల్‌గా టికెట్స్ ఇస్తున్న రజనీనీ చూసి దర్శకుడు బాలచందర్ సినిమాల్లోకి పరిచయం చేసారు. తాజాగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'జైలర్' చిత్రం ఘన విజయం సాధించడం తెలిసిందే.

నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

ప్రజాశక్తి- ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 కార్డ్ విధానాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఈ నెల 30, 31 తేదీల్లో పెన్‌డౌన్ చేపట్టినట్లు దస్తావేజు లేఖరులు తెలిపారు. ఎపి స్టేట్ డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు లేఖరులు ప్రకటించారు. ఈ విధానం వల్ల ఆస్తుల్లో తగాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అధికార ట్యాక్స్‌లు వేరయా..!

- ట్యాక్సుల్లో నేతల ట్యాక్స్ వేరు..!
- నిర్మాణం జరిగితే ముట్టజెప్పాల్సిందే..
- లేకుంటే నిర్మాణాలు ఆగాల్సిందే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాధారణంగా ఏమైనా నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వానికిగానీ, స్థానిక సంస్థలకుగానీ ట్యాక్సు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనంతపురం నగరంలో మాత్రం నేతల ట్యాక్సులు చెల్లించాల్సి వస్తోంది. ఏ భవన నిర్మాణం జరిగినా ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సులు చెల్లించినప్పటికీ స్థానిక నేతల ట్యాక్సులు చెల్లించాల్సి వస్తోంది. వారి వారి స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రధానంగా నగర పాలక సంస్థ పరిధిలోనున్న అధికార పార్టీ కార్పొరేటర్లు కొందరు ఇదే పని మీద ఉన్నట్టు ఆరోపణలున్నాయి. నిర్మాణం చేపట్టేది అధికారపార్టీకి సంబంధించిన వారైనా సరే తమ ట్యాక్సు మాత్రం కట్టాల్సిందే. లేకపోతే మధ్యలోనే నిర్మాణాలు ఆపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవలి కాలంలో ఇటువంటి ఘటన ఒకటి చోటు చేసుకుంది.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నా పైసలివ్వాల్సిందే...

అనంతపురం నగరంలోని సాయినగర్ నర్సింగ్ హోం నిర్మాణం జరుగుతోంది. ఆ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి స్థానిక నేతల నుంచి ఇబ్బందులు తప్పలేదు. నిర్మాణం కోసం బోరు వేసే సమయంలోనే నేతలు అక్కడికి చేరుకున్నారు. తమ ట్యాక్సు కట్టకుండా బోరు ఏ రకంగా వేస్తారంటూ అడ్డుకున్నారు. చివరకు చేసేది లేక కొంత మొత్తాన్ని ముట్టజెప్పారు. ఇక తాజాగా అదే భవనానికి సంబంధించి విద్యుత్ సరఫరా కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు కోసం పనులు చేపట్టారు. రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ పెట్టినందుకు కూడా తనకు ట్యాక్సు కట్టాల్సిందేనని పట్టుబట్టినట్టు సమాచారం. ఇలా ప్రతి అంశంలోనూ డబ్బులు ఇవ్వాల్సి రావడం పట్ల నర్సింగ్ హోం యజమానులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. సమస్యను ముఖ్య నాయకుడి వరకు తీసుకెళ్లే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. దీనిపై నిఘా వర్గాలు సైతం వివరాలు సేకరించే పనిలోపడ్డాయి. ఇలా నగరంలో అనేక చోట్ల నేతల వసూళ్ల పర్వం కొనసాగుతోంది. ఇక పెద్ద భవనాలకైతే లక్షల్లోనే ముట్టజెప్పాల్సి వస్తోంది.

అభివృద్ధి పని అయినా అంతే..

ఇక అభివృద్ధి పనులకు సైతం పర్సంటేజీలు ఇచ్చుకోవాలి. లేకుంటే తమ డివిజన్ పరిధిలో అయినా పని చేయడానికి వీల్లేదు. విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి జెఎన్‌టియుకు వెళ్లే దారిలో పర్సంటేజీలివ్వలేదని గతంలో బాహాటంగానే కాంట్రాక్టరుతో గొవడ పడిన ఘటనలూ ఉన్నాయి. వారికి ముందుగా పది శాతమైనా చెల్లించాలి. అదేమంటే 'తాము ఎన్నికల్లో లక్షల్ల ఖర్చు పెట్టుకున్నాం. ఇక దాన్ని రికవరీ చేసుకోవాల్సిందే కదా' అని బాహాటంగానే చెబుతుండటం గమనార్హం. ఇలా ప్రతి పనికీ ఎంతో కొంత ముట్టజెప్పనిదే ముందుకు కదలదు. ప్రజలకు సేవ చేసేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే వీరు చేసే పని మాత్రం ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. సొంత పని జరగాలన్నా, అభివృద్ధి పనులు జరగాలన్నా వీరి అనుమతులు మాత్రం తప్పనిసరిగా ఉండాల్సిందే.

నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలోని బిఎస్ఎం నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం బిఎస్ఎంలో చదువుతున్న దెందులూరు మండలానికి చెందిన విద్యార్థిని(18) సీనియర్ల వేధింపులు భరించలేక సోమవారం అర్ధరాత్రి పారాసిట్మల్ మాత్రలు అధికంగా మింగి ఆత్మహత్యకు యత్నించింది. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థినులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది.

తెలంగాణలో శాశ్వత నివాసులైన విద్యార్థులందరూ స్థానికులే

- మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియలో అదే విధానం అమలు చేయాలి
- కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మెడికల్ సీట్ల భర్తీ విషయంలో స్థానిక కోటా వ్యవహారంపై హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. తెలంగాణలో శాశ్వత నివాసితులైన విద్యార్థులందరినీ స్థానికులగానే పరిగణించాలని పేర్కొంది. ఆ విధంగానే 2023-24 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్, బిడిఎస్ సీట్ల అడ్మిషన్లు చేపట్టాలని పేర్కొంది. ఈ మేరకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో శాశ్వత నివాసితులమని అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని వారం రోజుల్లోగా వర్సిటీకి సమర్పించాలని పిటిషనర్లకు న్యాయస్థానం సూచించింది. ఆ విధంగా వచ్చిన అప్లికేషన్లను పరిశీలించి ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల్లో సీట్ల కేటాయింపులు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. స్థానిక కోటా నిబంధన-2017లోని 3 (111) (బి) ప్రకారం ఒక విద్యార్థిని స్థానికుడిగా పరిగణించాలంటే... మెడికల్ అడ్మిషన్లకు ముందు నాలుగేళ్లు తెలంగాణలోనే నివాసం ఉండాలి. తెలంగాణలోనే చదివి ఉండాలనే నిబంధనకనుగుణంగా ప్రభుత్వం జిఒ 114ని జారీ చేసింది. దీనిని హైదరాబాద్‌కు చెందిన రాథోడ్, ఇతరులు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్లపై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. వాదోపవాదనల అనంతరం తీర్పు చెప్పింది. ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయని, ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని న్యాయస్థానం పేర్కొంది. అయినప్పటికీ నిబంధనను కొట్టేయడం లేదని చెప్పింది. ఈ తరహాలో సుప్రీంకోర్టు కూడా తీర్పులు చెప్పిందని న్యాయమూర్తి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

చేపల చెరువులో పడవ బోల్తా

- ఒకరు మృతి

ప్రజాశక్తి - భీమడోలు (ఏలూరు జిల్లా)

చేపల చెరువులో పడవ బోల్తాపడి యువకుడు మృతి సంఘటన ఆగడాలలంకలో మంగళవారం చోటుచేసుకుంది. భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఆగడాలలంక గ్రామానికి చెందిన వెంప సజ్జన్(18)తో పాటు మరో ఇద్దరు కలిసి 40 ఎకరాల విస్తీర్ణంలోని పది అడుగులలోతు గల చేపల చెరువు మీదుగా పశువులకు గడ్డి కోసం రేకుపడవలో కొల్లేరు ప్రాంతానికి వెళ్లారు. గడ్డి కోసిన అనంతరం తిరుగు ప్రయాణంలో వారి పడవ బోల్తాపడింది. ఈ సంఘటనలో ఇద్దరు యువకులు ఈదుకుంటూ గట్టుకు చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. సజ్జన్ మాత్రం చెరువులో మునిగిపోయాడు.

పారిశుధ్యానికి ముగ్గురు బాసులు..!



- తెలుగుగంగలో నిలిచిన నీటి ప్రవాహం
- మరో తడి అందితేనే చేతికి పంటలు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - రుద్రవరం (నంద్యాల)

తెలుగు గంగ ప్రధాన కాలువలో మంగళవారం నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల క్రితం వెలుగోడు రిజర్వాయర్ నుంచి 2000 క్యూసెక్కుల నీరును గంగా అధికారులు వారాబందీ పద్ధతిలో విడుదల చేశారు. దీంతో రైతులు మొక్కజొన్న, మినుము, పత్తి, మిర్చి, వరి పంటలకు కాలువల ద్వారా నీరును పారించుకున్నారు. అయితే అధికారులు నీటిని నిలుపుదల చేయడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు అరకొరగా సాగునీరు అందింది. అలాగే ప్రధాన కాలువ ద్వారా చెరువులకు నీరు పూర్తిగా అందకపోవడంతో చెరువు కింద పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలుగంగ ప్రధాన కాలువ కింద పంటలు సాగు చేసిన రైతులకు నీరు నిలిచిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కాలువల్లో ఆయిల్ ఇంజన్లు వేసి పంటలకు నీరు పెట్టుకుంటున్నారు. సాగు చేసిన పంటలకు మరో మారు నీరు పెడితే పంటలు పూర్తిగా పండే అవకాశం ఉందని, తెలుగుగంగ అధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరోమారు సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని రుద్రవరం మండల రైతులు కోరుతున్నారు.

పవర్‌లూమ్‌లో హ్యాండ్‌లూమ్స్ నేస్తే చర్యలు

- ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నిబంధనలను అతిక్రమించి పవర్‌లూమ్స్‌లో హ్యాండ్‌లూమ్ రకాలు నేస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. ధర్మవరం పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవర్లూమ్స్ ప్యూర్ టూ ప్యూర్ నేస్తూ చట్టాన్ని అతిక్రమిస్తున్నట్లు సమాచారం రావడంతో శివానగర్ ప్రభాకర్, సిద్ధయ్యగుట్ట గుర్రం రామాంజినేయులు, పార్థసారధినగర్‌లో మంజులకు సంబంధించిన పవర్‌లూమ్స్‌ను తనిఖీ చేశారు. అందులో ప్యూర్‌టూప్యూర్ వైలేషన్ చేస్తున్నట్టు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు మొత్తం తొమ్మిది కేసులు నమోదు చేశామన్నారు. ఇక నుంచి నిత్యం వపర్లూమ్స్‌లపై దాడులు చేస్తామన్నారు.

ప్రతి పేద కుటుంబానికీ లబ్ధి

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ (నంద్యాల)

రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని డిప్యూటీ సిఎం, జిల్లా ఇన్చార్జి మంత్రి అంజాద్ భాషా పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్, మనబడి నాడు- నేడు, వ్యవసాయం, రీ సర్వే, వైద్య ఆరోగ్యం, ఇరిగేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి చెందాలనే ప్రధాన ఆశయంతో రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్నారాన్నరు. పేదవారికి ఇవ్వగలిగే ఆస్తి ఏదైనా ఉంటే అది కేవలం విద్య మాత్రమే అని ఎప్పుడు అంటుంటారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ గౌసియా బేగం, జలవనరుల శాఖ చైర్మన్ గిరిజ హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస రావు, డిఆర్ఓ పుల్లయ్య, కమిషనర్ రమేష్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండలాధ్యక్షులు, జడ్పిటిసిలు, ఎంపీడీవోలు, తహశీల్దారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, ఆళ్ళగడ్డ నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జెపి వెంచర్స్ ముసుగులో బినామీ


- టిడిపి నేత కొమ్మారెడ్డి పట్టాభి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జెపి పవర్ వెంచర్స్ సంస్థ ముసుగులో బినామీలను సబ్ కాంట్రాక్టర్లుగా పెట్టి సిఎం ఇసుక దోపిడీ సాగిస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. మంగళవారం టిడిపి జాతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ క్వార్టర్లీ ఫైనాన్షియల్ ఇయర్ రిపోర్టు ఆధారంగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాల్లో తమకేం సంబంధం లేదని, సబ్ కాంట్రాక్టు ఇచ్చామని జెపి వెంచర్స్ సంస్థ రిపోర్టు కూడా ఇచ్చిందని తెలిపారు. సబ్ కాంట్రాక్టరు ప్రభుత్వానికి రూ.302 కోట్ల బకాయి పెట్టారని ఇచ్చిన రిపోర్టుపైనా సమాధానం ఇవ్వాలని ఆయన కోరారు. మొత్తం నడుపుతోంది సిఎం, పెద్దిరెడ్డి అని పేర్కొన్నారు. ఇటీవల బిఎస్‌సి, ఎన్ఎస్‌కి ఇచ్చిన నివేదికలో తాము రూ.1,528 కోట్లకు కాంట్రాక్టు పాడుకుని, మరో కంపెనీకి సబ్ కాంట్రాక్టు ఇచ్చామని అదే కంపెనీ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తుందని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. అయితే ప్రభుత్వానికి రూ.302 కోట్ల బకాయి ఎందుకు ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. అయినా ఆ కంపెనీ పేరుతో బిల్లులు ఎందుకు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆడిట్ రిపోర్టులోనూ ఇసుకతో సంబంధం లేదని పేర్కొన్నారని వివరించారు. దీనిపై సిఎం నోరువిప్పాలన్నారు.

రాష్ట్రాల వారీగానే సర్దుబాట్లు

సీతారాం ఏచూరి ఇంటర్వ్యూ



2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల చీలిక వల్ల బిజెపి ప్రయోజనం పొందకుండా నివారించేందుకు గానూ ప్రతిపక్షాల మధ్య రాష్ట్రాలవారీగా పొత్తులు పెట్టుకోవడంపైనే ఇండియా బ్లాక్ దృష్టి కేంద్రీకరించనుంది. భారత రిపబ్లిక్ స్వభావాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి చెందిన పర్వేజ్ సుల్తాన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు :

ఇండియా ఫోరమ్ తదుపరి సమావేశం గురువారం (31వ తేదీ) జరగనుంది. ప్రతిపక్షాల ఫోరమ్‌కు కన్వీనర్‌ను నియమిస్తారని, కార్యదర్శివర్గాన్ని ఏర్పాటు చేస్తారని, కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందిస్తారని వార్తలు వస్తున్నాయి. ప్రతిపక్షాల ఫోరమ్ ముందున్న మార్గం గురించి మీరేం ఆలోచిస్తారు?

ఈ వేదిక ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పుతోంది. అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒక్కచోటకు తీసుకువచ్చిన అంశాలు వున్నాయి. మన రిపబ్లిక్ స్వభావాన్ని పరిరక్షించడమనే మౌలిక అంశాలు కూడా ఇందులో వున్నాయి-మనది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్. రాజ్యాంగం హామీ కల్పించిన హక్కులను కాపాడాల్సి వుంది. అదే మా ప్రాథమిక లక్ష్యంగా వుంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే సాధారణంగా కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందుతూ వుంటుంది. ఎన్నికల ముందు ఎప్పుడూ రూపొందలేదు. కానీ, ఇప్పుడు మా ప్రచారం సందర్భంగా ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన కొన్ని ఉమ్మడి సమస్యలు, అంశాలు కచ్చితంగా వున్నాయి. కార్యదర్శివర్గాన్ని ఏర్పాటు చేయడమా లేక మరే ఇతర రకమైన సమన్వయమా అన్నది ముంబయి సమావేశంలో చర్చిస్తాం. కార్యదర్శివర్గాన్ని, కన్వీనర్‌ను లేదా మరి దేన్నైనా ఏర్పాటు చేయడమన్నది అవసరం కాదు. అలయన్స్ భాగస్వాముల మధ్య సమన్వయం ఎలా వుండాలో మేం చర్చించనున్నాం.

లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రాల వారీగా సీట్ల సర్దుబాటు గురించి మాట్లాడుతున్నారు. కొంచెం వివరించండి....

ప్రతిపక్షాల ఓట్లలో చీలిక వల్ల బిజెపి పొందే ప్రయోజనాలను తగ్గించడానికే ఈ సీట్ల సర్దుబాటు ఆలోచన. కేరళలో, మేం కాంగ్రెస్‌తో నేరుగా పోరాడుతున్నాం. అక్కడ బిజెపికి ఒక్క ఎంఎల్ఎ కూడా లేరు, ఇక ఎంపీ గురించి ఆలోచనే అక్కర్లేదు. అందువల్ల వామపక్షాలు, కాంగ్రెస్ ముఖాముఖి పోరులో వున్నందువల్ల బిజెపికి వచ్చే ప్రయోజనమేమీ వుండదు. ఎందుకంటే బిజెపి అక్కడ అస్సలు లేనే లేదు. ఇకపోతే పశ్చిమ బెంగాల్‌లో, బిజెపికి, టిఎంసి (తృణమూల్ కాంగ్రెస్)కి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర లౌకిక శక్తులు కలిసి బిజెపిని బలహీనపరుస్తాయి. ఉదాహరణకు, పశ్చిమ బెంగాల్‌లో బిజెపికి వ్యతిరేకంగా మేమందరం ఒక తాటిపైకి వచ్చామనుకుందాం, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ బిజెపికే వెళతాయి. అలా కాకుండా బెంగాల్‌లో త్రిముఖ పోటీ జరిగినట్లైతే బిజెపి పొందే లాభం తగ్గుతుంది. అందువల్ల అన్ని రాష్ట్రాలను వేటికవే భిన్నంగా చూడనున్నాం.

సంకీర్ణ భాగస్వాముల్లో కొన్నింటి మధ్య తీవ్ర విభేదాలు వున్నాయి. అటువంటపుడు అన్ని పార్టీలు కలిసి కట్టుగా పనిచేయగలరని మీరు భావిస్తున్నారా?

ప్రజలు మమ్మల్నందరినీ కలిసికట్టుగా వుంచుతారని నేను భావిస్తున్నాను. మమ్మల్ని ఇలా ఒక్క చోటకు తీసుకు వచ్చింది కూడా ప్రజల ఒత్తిడే. ప్రజల తోడ్పాటు కారణంగానే ఎమర్జన్సీ ఓడిపోయింది. అదే కారణంతోనే వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఓటమి పాలైంది. ఈ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుంది. పైగా ప్రజల ఆకాంక్షలను మోసపుచ్చడమనేది ఏ ప్రతిపక్ష పార్టీకైనా చాలా కష్టం కాగలదు.

పార్లమెంట్‌లో సిపిఎం బలం గణనీయంగా తగ్గిపోయింది. అందుకు కారణం ఏమిటి? ఎంపీలను పెంచుకునేందుకు మీరేం చేయాలనుకుంటున్నారు?

ఇందుకు కారణాలు చాలా వున్నాయి. మాకు వ్యతిరేకంగా - అతివాదం నుండి మితవాదం వరకు - పెద్ద ముఠానే వుంది. అయితే ఇదొక కారణమే. మా వైపు నుండి కూడా కొన్ని పొరపాట్లు వున్నాయి. ఫలితంగా ఎన్నికల్లో మా పార్టీకి మద్దతు గణనీయంగా క్షీణించింది. అయితే అదే సమయంలో, దేశం ముందు ఒక ఎజెండాను నిర్దేశించగలిగే మా సామర్థ్యం ...ప్రజా ఉద్యమాల ద్వారా ఎజెండాను రూపొందించడం - వాస్తవానికి బలోపేతమైంది. మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటం ప్రధాని మోడీని వెనక్కి కొట్టింది. ఆ మూడు వివాదాస్పద బిల్లులు ఉపసంహరించుకున్నారు...కేవలం ఉద్యమాల వల్లనే ప్రధాని వాటిని ఉపసంహరిచుకోవాల్సి వచ్చింది. కేవలం మా ఉద్యమాల ద్వారా కార్మిక వర్గం చేస్తున్న పోరాటం కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ క్రమంలో జాప్యం జరుగుతోంది. అందువల్ల, ప్రజా ఉద్యమాల ద్వారా జాతీయ ఎజెండాను రూపొందించడం వామపక్షాల పాత్రగా వుంది. అయితే, ఎన్నికల పరంగా చూసినట్లైతే మీరంటున్నది నిజమే. దాన్ని సరిదిద్దుకోవాల్సి వుంది. దానిపైనే మేం కృషి చేస్తున్నాం.

మీరు ఇటీవల మణిపూర్‌లో పర్యటించారు. ఒక వర్గం ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని డిమాండ్ చేసే పరిస్థితి ఎలా వచ్చింది ?

అక్కడ పరిస్థితి భయంకరంగా వుంది. నా జీవితంలో దేశంలో మరెక్కడా కూడా ఇలాంటి పరిస్థితులను చూడలేదు. నిజానికి ఒక రాష్ట్రంలో రెండు దేశాలు వున్నాయి. మెయితీలు, కుకీలు నివసించే రెండు ప్రాంతాలకూ వెళ్లాం. మెయితీ పక్షం నుండి కుకీ ప్రాంతంలోకి మీరు వెళ్లాలనుకుంటే మెయితీలు ఎవరినీ మీతో అనుమతించరు. కుకీ ప్రాంతాల్లో పర్యటించేటపుడు మెయితీ అయిన మా పార్టీ కార్యదర్శినే మేం అక్కడ వదిలివేయాల్సి వచ్చింది. అలాగే మెయితీ ఏరియాలోకి వెళ్లాలన్నా కూడా ఇదే పరిస్థితి. రెండు వేర్వేరు ప్రాంతాలు అవి. నిజానికి అక్కడ యుద్ధం తరహా పరిస్థితి నెలకొంది. ఒక వైపు నుండి ఇంకో వైపునకు మీరు వెళ్లానుకుంటే మూడు స్థాయిల్లో అడ్డగించడాలు వుంటాయి. అవన్నీ చేసేది భద్రతా బలగాలు కాదు, స్థానికులే.

ప్రజలు, సమాజం పట్ల ఒక తరహాలో అమానుషంగా వ్యవహరించడం ఆ రాష్ట్రంలో జరుగుతోంది. ఈ జాతుల ఘర్షణలను సృష్టించడంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' (కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బిజెపి ప్రభుత్వాలే వుండడం) ది చాలా పెద్ద పాత్ర. ఎన్నికల్లో కుకీ మిలిటెంట్ గ్రూపులకు మద్దతిచ్చింది. అస్సాం ముఖ్యమంత్రితో, ఈశాన్య ప్రాంత బిజెపి ఇన్‌చార్జితో తమకు ఒప్పందం వున్నట్లు వారు (కుకీలు) చెబుతున్నారు. తాము బిజెపికి మద్దతివ్వడం వల్లనే మణిపూర్ ముఖ్యమంత్రిగా బీరేన్ సింగ్ వున్నారని కుకీ మిలిటెంట్లు చెబుతున్నారు.

పది మంది కుకీ ఎంఎల్ఎల్లో ఏడుగురు బిజెపికి చెందినవారే, వారిలో ఇద్దరు మంత్రులు. అయితే, కుకీలందరూ మయన్మార్ నుండి అక్రమంగా వచ్చిన శరణార్ధులేనని ముఖ్యమంత్రి చెబుతున్నారు. కేంద్ర హోం మంత్రి కూడా లోక్‌సభలో ఇదే విషయాన్ని చెప్పారు. దాంతో ఆనాడు ఎన్నికల్లో గెలుపొందడానికి మా మద్దతు కోరి ఇప్పుడు తమను అక్రమ శరణార్ధులుగా, నార్కో తీవ్రవాదులుగా పిలుస్తున్నారని కుకీలు విమర్శిస్తున్నారు.

ఇప్పుడు నాగాలు కూడా రంగంలోకి వచ్చారు. నాగాల భూమిలో ఈ హింస జరుగుతోందని వారంటున్నారు. నాగా ఒప్పందానికి, మణిపూర్‌లో భూమికి చాలా సంబంధం వుంది. మంటలు ఆర్పకపోయినట్లైతే, పరిస్థితులు వారి (ప్రభుత్వం) నియంత్రణ నుండి చేదాటి పోతాయి. మిజోరాం కూడా ప్రభావితమవుతుంది. ఈ సమస్యను ప్రభుత్వం త్వరగా పరిష్కరించని పక్షంలో, మొత్తంగా ఈశాన్య ప్రాంతమంతా ఇది విస్తరించే అవకాశం వుంది. సహాయ శిబిరాల్లో పరిస్థితులు - అది ఆహారం కానివ్వండి లేదా పారిశుధ్యం కానివ్వండి - చాలా భీతిగొలిపేలా వున్నాయి. అక్కడ పుట్టే పిల్లలకు ఎలాంటి వ్యాధి నిరోధక కార్యక్రమాలు వుండవు, పోషకాహారమూ వుండదు.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే తీసుకోవాల్సిన చర్యలు ఏంటి ?

అక్కడ 60వేల మంది కేంద్ర భద్రతా బలగాలు వున్నాయి. కానీ ఏం చర్యలు చేపట్టాల్సిన అవసరముంది అన్న విషయంలో వారికెలాంటి ఆదేశాలు లేవు. వారికి గనక ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లైతే, చాలా వరకు హింసను అదుపు చేయగలుగుతాం. మణిపూర్‌లోని ప్రతి ఒక్క వర్గానికి చెందిన వారిని కలుసుకునేందుకు కేంద్ర హోం మంత్రి నాయకత్వంలో ప్రభుత్వం అఖిల పక్ష ప్రతినిధి బృందాన్ని పంపాలి. వారి సాధకబాధలు వినాలి, వారి ఆకాంక్షలకు తగినట్లుగా పరిష్కారాన్ని రూపొందించేందుకు ప్రయత్నించాలి. మొదటి రోజునుండీ మేం ఇదే చెబుతూ వస్తున్నాం. మూడుసార్లు కాశ్మీర్‌కు వెళ్ళిన అటువంటి ప్రతినిధి బృందంలో శివరాజ్ పాటిల్, పి.చిదంబరం, రాజ్‌నాథ్ సింగ్‌లతో కలిసి నేను కూడా వెళ్ళాను. ఈ మూడు సందర్భాల్లోనూ, కొన్ని పరిష్కారాలు రూపొందించే దిశగా మేం ప్రయత్నించాం. ఇప్పుడు, ఇక్కడ అదే పనిని వారు (ప్రభుత్వం) ఎందుకు చేయడం లేదు ?

జీ20 అతిధుల కోసం భారీ ఏర్పాట్లు

న్యూఢిల్లీ : సెప్టెంబర్ 9వ తేదీ నుంచి రెండు రోజులపాటు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న జీ 20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనే అతిథుల కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) పరిధిలోని దాదాపు 30 హోటళ్లను వీరి ఆతిథ్యం కోసం బుక్ చేశారు.

ఢిల్లీలోని ఐటీసీ మౌర్యా, తాజ్ మాన్‌సింగ్, తాజ్ ప్యాలెస్, హోటల్ ఒబెరాయ్, హోటల్ లలిత్, ది లోధీ, మెరిడీయన్, హయత్ రీజెన్సీ, షంగ్రి లా, లీలా ప్యాలెస్, హోటల్ అశోక, ఎరోస్ హోటల్, ది సూర్యా, రాడిసన్ బ్లూ ప్లాజా, జేడబ్ల్యూ మారియట్, ది లీలా యాంబియన్స్ కన్వెన్షన్, ది ఇంపీరియల్ తదితర హోటళ్లు ఉన్నాయి. ఇక ఎన్‌సీఆర్ పరిధిలోని వివంత, ఐటీసీ గ్రాండ్, తాజ్ సిటీ సెంటర్ హయత్ రీజెన్సీ (గురుగ్రామ్) ది ఒబెరాయ్ తదితర హోటళ్లున్నాయి.

ఐటీసీ మౌర్యాలో బైడెన్ బస

ప్రభుత్వ అధికారుల సమాచారం ప్రకారం ఐటీసీ మౌర్యాలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ బస చేయనున్నారు. ఇక్కడ అన్ని ఫ్లోర్లు అమెరికా సీక్రెట్ సర్వీస్ కమాండోల ఆధీనంలోకి వెళ్లనున్నాయి. ఈ హోటల్ 14 వ అంతస్తులో బైడెన్ బస చేసే గది ఉంది. ఆ ఫ్లోర్ చేరడానికి ప్రత్యేకంగా లిఫ్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఈ హోటల్లో 400 గదులను అతిథుల కోసం బుక్ చేశారు. ఇక హోటల్ షంగ్రి-లాలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, క్లారిడ్జెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఇంపీరియల్ హోటల్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ ఆతిథ్యం స్వీకరించనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సదస్సుకు హాజరైతే తాజ్ ప్యాలెస్‌లో ఆయనకు విడిది ఏర్పాటు చేశారు. ఇదే హోటల్‌లో బ్రెజిల్ నుంచి వచ్చే అతిథులు కూడా ఉంటారు. ఒబెరాయ్ హోటల్లో తుర్కియే దౌత్య బృందాలు బసచేయనున్నాయి. మారిషస్, నెదర్లాండ్స్, నైజీరియా, స్పెయిన్ బృందాలు లా మెరీడియన్ హోటల్‌లో ఉండనున్నాయి. ఇప్పటికే యూకే, అమెరికా, చైనా నుంచి లైజనింగ్ బృందాల భారత్‌కు చేరుకొన్నాయి.

విదేశీ అతిథుల రక్షణ బాధ్యతలను సెంట్రల్ పారామిలటరీ, ఎన్ఎస్‌జీ కమాండో, ఢిల్లీ పోలీస్ బృందాలు చూసుకొంటున్నాయి.

వీటిల్లో ఒక్కో బృందానికి ప్రత్యేక బాధ్యతలను అప్పగించారు. అలాగే అమెరికా అధ్యక్షుడు బైడన్ రానుండటంతో ఆ దేశానికి చెందిన సీక్రెట్ సర్వీస్ బృందాలు కూడా మూడు రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయనున్నాయి. ఇప్పటికే హోంశాఖ జీ-20 సదస్సు భద్రతపై పలు సమీక్షా సమావేశాలు నిర్వహించింది. అతిథుల రక్షణ బాధ్యతలను చూసుకోవడంపై సీఆర్‌పీఎఫ్‌లోని 1,000 మంది సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరం ఢిల్లీ

- దక్షిణాసియాలో అతి పెద్ద ముప్పు వాయు కాలుష్యమే
- ఎనర్జీ పాలసీ ఇనిస్టిట్యూట్ నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచంలోకెల్లా అత్యంత కాలుష్య నగరంగా న్యూఢిల్లీ నమోదైంది. ప్రస్తుత కాలుష్య స్థాయిలు ఇలాగే కొనసాగితే ఢిల్లీ ప్రజలు తమ జీవిత కాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారని ఇటీవల జరిగిన కొత్త అధ్యయనం వెల్లడించింది. చికాగో యూనివర్శిటీలోని ఎనర్జీ పాలసీ ఇనిస్టిట్యూట్ గాలి నాణ్యతకు సంబంధించిన జీవన సూచీ (ఎక్యుఎల్ఐ)ని విడుదల చేసింది. నానాటికి పెరుగుతున్న వాయు కాలుష్యంతో మొత్తంగా దక్షిణాసియా ప్రాంతాలు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. దక్షిణాసియాలో ప్రతి వ్యక్తి ఆయుర్దాయంలో ఐదేళ్ల కన్నా ఎక్కువ కాలాన్ని ఈ కాలుష్యమే హరించివేస్తోంది.

భారతదేశంలోని 130 కోట్ల మంది ప్రజలూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నిర్దేశించిన పరిమితిని దాటిన కాలుష్య ప్రాంతాల్లోనే జీవిస్తున్నారని ఆ అధ్యయన నివేదిక పేర్కొంది. దేశ జాతీయ గాలి నాణ్యతా ప్రామాణికమైన 40ఎంజి/ఎం3 (క్యూబిక్ మీటర్ గాలిలో 40 ధూళి అణువులు నెలకొనడం) ని అధిగమించిన ప్రాంతాల్లోనే దేశంలోని 67.4శాతం ప్రజలు జీవిస్తున్నట్లు వెల్లడైంది. గాలి కాలుష్యంలో నెలకొన్న సన్నని రేణువుల (పిఎం 2.5) వల్ల సగటు భారతీయుడి ఆయుర్దాయం 5.3 సంవత్సరాలు తగ్గుతోందని అధ్యయనం తెలిపింది. కాలుష్యంతో మగ్గుతున ఢిల్లీ నగరంలో సగటున 11.9 సంవత్సరాల జీవిత కాలాన్ని కోల్పోతున్న వారి సంఖ్య దాదాపు కోటీ 80లక్షలుగా వుందని ఎక్యుఎల్ఐ పేర్కొంది. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రాంతంలో అత్యంత తక్కువగా కాలుష్యం నెలకొన్న ప్రాంతంగా నమోదైంది. అక్కడ కూడా డబ్ల్యుహెచ్ఓ పరిమితికి మించి ఏడు రెట్లు ఎక్కువగా కాలుష్యం నెలకొంది. ఇదే స్థాయి కొనసాగితే ప్రజల ఆయుర్దాయంలో 3.1 సంవత్సరాలు కోల్పోతారని అంచనా వేసింది. కేవలం ఆరు దేశాలు - బంగ్లాదేశ్, భారత్, పాకిస్తాన్, చైనా, నైజీరియా, ఇండోనేషియాల్లో ప్రజలు తాము పీలుస్తున్న గాల్లోని కాలుష్య కారకాల కారణంగా ఏడాది నుండి ఆరేళ్ల వరకు జీవిత కాలాన్ని కోల్పోతున్నారని ఎక్యుఎల్ఐ సృష్టికర్త మైఖేల్ గ్రీన్‌స్టోన్ తెలిపారు.

కుల వివక్ష వ్యతిరేక బిల్లుకు

కాలిఫోర్నియా అసెంబ్లీ ఆమోదం

వాషింగ్టన్ : కుల వివక్ష వ్యతిరేక బిల్లును కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. కుల వివక్షను సమర్ధవంతంగా ఎదుర్కొనాలని, రాష్ట్ర వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న వర్గాలకు రక్షణలను బలోపేతం చేయాలని ఈ బిల్లు కోరుతోంది. సోమవారం అసెంబ్లీ ఈ బిల్లును ఆమోదించి, గవర్నర్ గావిన్ న్యూసమ్ వద్దకు పంపింది. ఆయన సంతకంతో ఇది చట్టంగా మారుతుంది. వివక్ష వ్యతిరేక చట్టాల్లో కులాన్ని ఒక రక్షిత కేటగిరీగా చేర్చిన మొదటి అమెరికన్ రాష్ట్రంగా కాలిఫోర్నియా నమోదైంది. సెనెటర్ అయేషా వహాబ్ ఈ ఏడాది ప్రారంభంలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా, రాష్ట్రవ్యాప్తంగా కుల సమానత్వ, పౌర హక్కుల కార్యకర్తలు, సంఘాలు పలువురు మద్దతిచ్చారు. దీర్ఘకాలంగా నెలకొని వున్న వివక్ష నుండి ప్రజలను కాపాడేందుకు తీసుకున్న చర్యకు మద్దతిచ్చినందుకు ఆయేషా హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. కాగా కొయిలేషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా దీన్ని కాలిఫోర్నియా చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించింది. బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 700కి పైగా సమావేశాలు జరిగాయి. కుల సమానత్వ రక్షణల గురించి ప్రజలు గొంతెత్తి మాట్లాడారు. కుల వివక్షకు గురవుతున్న వారందరూ 20ఏళ్లుగా సంఘటితమై పోరాడుతునే వున్నారని, ఈనాటికి హింసాత్మక దాడులు, వివక్ష నుండి రక్షణ పొందే రోజు వచ్చిందని ఈక్విటీ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెన్‌మోయి సౌందరరాజన్ వ్యాఖ్యానించారు.

యుపి పాఠశాలలో లైంగిక వేధింపులు

గాజియాబాద్ : బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం వెలుగుచూసింది. గాజియాబాద్‌లో ఒక పాఠశాలలో ఏకంగా ప్రిన్స్‌పాలే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో వేధింపులకు పాల్పడుతున్న ప్రిన్సిపల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థినులు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాశారు. వివరాల్లోకి వెళ్తే.. గాజియాబాద్‌లోని ఓ పాఠశాల ప్రిన్సిపల్ గత కొన్నిరోజులుగా విద్యార్థినులను తన క్యాబిన్‌లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ప్రిన్సిపల్ ఆగడాలు మరింత మితిమీరడంతో తల్లిదండ్రులకు చెప్పారు. విషయం తెలుసుకున్న విద్యార్థినుల కుటుంబ సభ్యులు పాఠశాల ఎదుట ఆందోళనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్‌తో వాగ్వాదానికి దిగి అతడిపై దాడి చేశారు. అ. పోలీసులు ఇద్దరిపైనా కేసులు నమోదు చేసుకుని ప్రిన్సిపల్ ను అరెస్టు చేశారు.

పోలీసులు తమను బెదిరించి నాలుగు గంటలపాటు పోలీసు స్టేషన్‌లోనే కూర్చోపెట్టారని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తూ.. యోగి అదిత్యనాథ్‌కు విద్యార్థినులు రక్తంతో లేఖ రాశారు. లేఖలో 'ప్రిన్సిపల్ వేధింపులకు గురైన మేమంతా మీతో వ్యక్తిగతంగా మాట్లాడాలనుకుంటున్నాం. మిమ్మల్ని కలవడానికి మాకు అనుమతి ఇవ్వండి. న్యాయం చేయండి. మేమంతా మీ కుమార్తెలమే. ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం ' అంటూ రక్తంతో లేఖ రాశారు.

గుర్తింపు, ప్రయోజనాలు నిల్

గంటల తరబడి విధులు

- బెంగాల్‌లో గిగ్ కార్మికుల వెతలు
- ఉద్యమ బలోపేతంపై చర్చలు



కోల్‌కతా : ఎలాంటి ప్రయోజనాలు లేకుండా గంటల తరబడి పని చేయాల్సి వస్తోందని, పైగా గుర్తింపు కూడా వుండడం లేదని గిగ్, అసంఘటిత రంగ కార్మికులు వాపోతున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టాల్సిన కార్యచరణపై, పశ్చిమ బెంగాల్‌లో తమ ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవడానికి గల మార్గాలపై చర్చించేందుకు ఇక్కడ కృష్ణపాద మెమోరియల్ హాల్‌లో వందలాదిమంది కార్మికులు సమావేశమయ్యారు. భారత నిర్మాణ కార్మికుల సమాఖ్య (సిడబ్లుఎఫ్ఐ) నేత దేవాంజన్ చక్రవర్తి ఈ సదస్సుకు అధ్యక్షత వహించగా, ఆఖిల భారత గిగ్ వర్కర్స్ యూనియన్ కోల్‌కతా జిల్లా కార్యదర్శి సాగ్నిక్ సేన్‌గుప్తా సదస్సుకు ప్రతిపాదనలు సమర్పించారు. సిఐటియు కోల్‌కతా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి దేవాశిష్ రాయ్, అఖిల భారత గిగ్ వర్కర్స్ యూనెఇయన్ నేత సురాజిత్ ఘోష్‌లతో సహా పలువురు వక్తలు ఈ సదస్సులో ప్రసంగించారు.

సంఘటిత రంగంలో పనిచేసే వారిలా ఈ రంగంలో పనిచేసేవారికి ఎలాంటి నియమాక పత్రాలు వుండవు, పైగా ఇఎస్ఐ, పెన్షన్ వంటి సదుపాయాలు వుండవు, రోజులో సుదీర్ఘకాలం పనిచేసినా తమ కనీస అవసరాలు తీరేలా సంపాదన వుండడం లేదని వారు వాపోతున్నారు. సిఐటియు అనుబంధ సంస్థ అయిన గిగ్ అండ్ ఇన్‌ఫార్మల్ సెక్టార్ వర్కర్స్ యూనియన్ సభ్యుడైన బెరా మాట్లాడుతూ సమాజంలో నిలదొక్కుకునేందుకు పోరాడుతున్నామని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో ఎలాంటి అవకాశాలు వుండడం లేదని అన్నారు. సైట్ సూపర్‌వైజర్‌గా నెలకు కేవలం రూ.12వేలతో సంసారాన్ని పోషించడం కష్టంగా వుందన్నారు.

ఇక స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేసే ప్రశాంత్ ఘోష్ మాట్లాడుతూ 8గంటల్లో 14 డెలివరీల వరకు ఇవ్వాల్సి వుంటుందని, కానీ వాస్తవానికి వాటికే 12 నుండి 14 గంటలు పడుతుందని, ఇంత చేసి సంపాదించేంది కేవలం రూ.550 అని అన్నారు. డెలివరీ బాయ్ బదులుగా వీరిని డెలివరీ పార్టనర్స్‌గా గుర్తించాలని కోరుతున్నారు. ప్రమాద బీమా వుండదని, ఏదైనా జరిగినా కంపెనీ పట్టించుకోదని అన్నారు. పోలీసుల వేధింపులు కూడా తప్పవని అన్నారు. యాప్ ప్రాతిపదిక గల డెలివరీ పార్టనర్స్‌గానే కంపెనీలు వీరిని చూస్తున్నాయని సిఐటియు నేత దేవాశిష్ రాయ్ అన్నారు. ఈ రంగానికి సంబంధించి రాజస్థాన్ ప్రభుత్వం కొన్ని సానుకూల చర్యలు తీసుకుంది కానీ బెంగాల్ ప్రభుత్వంతో సహా మరే ఇతర రాష్ట్రాలు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. యాప్ ప్రాతిపదికన పనిచేసే వారందరికీ సంబంధించి ఒక బిల్లును తీసుకురావాలనుకుంటున్నట్లు ఇటీవల బెంగాల్ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు.


అయితే మొత్తంగా కార్మికుల దోపిడీని పరిష్కరించేందుకు ఏ ప్రభుత్వమూ చర్యలు తీసుకోవడం లేదని రాయ్ విమర్శించారు. ఈ రంగాల్లో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన కార్మికులందరినీ కలుపుకుని మరింత విస్తృతమైన ఉద్యమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ

- న్యూస్‌క్లిక్ ఉదంతంపై ఎన్ రామ్

న్యూఢిల్లీ : దేశంలో పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని ప్రముఖ పాత్రికేయుడు, హిందూ దినపత్రిక మాజీ సంపాదకుడు ఎన్.రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటన్ పత్రిక 'ప్రాస్పెక్ట్'కు ఆయన ఓ వ్యాసం రాస్తూ భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ దాడికి గురవుతోందని తెలిపారు. న్యూస్‌క్లిక్‌కు చైనా నుండి నిధులు అందుతున్నాయని ఆరోపిస్తూ న్యూయార్క్ టైమ్స్‌లో కథనం ప్రచురితమైన తర్వాత ఆ సంస్థపై బీజేపీ, ఆ పార్టీ నాయకులు, మంత్రులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ముప్పేట దాడి చేసిన విషయం విదితమే. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తమపై వచ్చిన నిరాధార ఆరోపణలను న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ తోసిపుచ్చారు. న్యూస్‌క్లిక్‌పై వచ్చిన ఆరోపణలను రామ్ ఆ వ్యాసంలో ప్రస్తావించారు. న్యూస్‌క్లిక్‌పై ప్రభుత్వ ప్రోత్సాహంతో తప్పుడు ప్రచారం సాగించారని, భయాందోళనలు రేకెత్తించారని, దూషణల పర్వం సాగించారని ఆయన తెలిపారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు సైతం దిగారని వివరించారు.

సల్ఫర్‌ను గుర్తించిన ప్రజ్ఞాన్ రోవర్



బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా చంద్రుడిపై పరిశోధనలు చేస్తున్న ప్రజ్ఞాన్ రోవర్ తన పరిశోధనల్లో మరిన్ని కీలక అంశాలను గుర్తించింది. రోవర్‌లోని 'లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (లిబ్స్)' పరికరం.. చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ఉపరితలంపై సల్ఫర్ ఉనికిని స్పష్టంగా గుర్తించినట్లు ఇస్రో తాజాగా వెల్లడించింది. దీంతోపాటు అల్యూమినియం, కాల్షియం, ఫెర్రమ్ (ఇనుము), క్రోమి యం, టైటానియం, సిలికాన్, మాంగనీస్, ఆక్సిజన్ మూలకాలను సైతం ప్రజ్ఞాన్ రోవర్ గుర్తించడం విశేషం. హైడ్రోజన్ కోసం శోధన కొనసాగుతుందని ఇస్రో తెలిపింది. చంద్రుడిపై మట్టి, రాళ్లను అధ్యయనం చేసేందుకు.. అక్కడి రసాయన, ఖనిజాలను పరిశోధించేందుకుగానూ 'లిబ్స్' పరికరాన్ని పంపించారు. ఈ పరిక రాన్ని బెంగళూరులోని ఎలక్ట్రో-ఆప్టిక్స్ సిస్టమ్స్ ప్రయోగశాలలో అభివృద్ధి చేశారు.

ఒడిషాలో ముందస్తు ఎన్నికలు?

- 13న రాష్ట్రానికి ఇసి బృందం

భువనేశ్వర్: మరికొన్ని నెలల్లో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇదే సమయంలో ఒడిషాలో కూడా అసెంబ్లీ ఎన్నికలకు జరుగుతాయని వార్తలు వస్తున్నాయి. ఈ రాష్ట్రంలో త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం బృందం అక్కడ పర్యటించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరుతుంది.

సెప్టెంబర్ 13న కేంద్ర ఎన్నికల బృందం రాష్ట్రంలో పర్యటించి అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నట్లు ఒడిషా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నికుంజ బిహారీ ధల్ పేర్కొన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను అక్టోబర్‌లో పరిశీలించి, నవంబర్ 15వరకు సిద్ధంగా ఉంచుతామన్నారు. అయితే ముందసు ఎన్నికల గురించి బిహారీ ధల్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే మరోవైపు రాష్ట్రంలో

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధమేనని అధికార బిజూ జనతాదళ్(బిజెడి) పాటు బిజెపి, కాంగ్రెస్‌లు ఇటీవల ప్రకటనలు చేస్తున్నాయి. బిజెడి ముందస్తుకు వెళ్లవచ్చని ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మొదటిసారి లేవనెత్తారు. తరువాత నుంచి వివిధ పార్టీల నాయకుల ఊహాగానాలతో ముందస్తు ప్రచారం ముమ్మరంగా సాగుతోంది.

మణిపూర్ శాసనసభ వాయిదా

- హింసపై చర్చకు మరింత సమయం అవసరం : కాంగ్రెస్ డిమాండ్

ఇంఫాల్ : సమావేశం ప్రారంభమైన గంటకే మణిపూర్ శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. సభను కేవలం ఒకే ఒక రోజు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కనీసం ఐదు రోజుల పాటు సభ జరగాలని ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. జాతి ఘర్షణలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై చర్చించేందుకు ఒక రోజు సమయం చాలదని ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి ఒక్రం ఇబోబి సింగ్ చెప్పారు. కాగా శాసనసభ సమావేశానికి కుకీ తెగకు చెందిన పది మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు అయ్యారు.

శాసనసభ మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశమైంది. మే 3వ తేదీ నుండి కుకీలు, మైతీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తొలుత ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రసంగిస్తూ హింసాకాండలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబాలను ఓదార్చడానికి మాటలు రావడం లేదని చెప్పారు.

ఏ సమయంలోనైనా .. లోక్‌సభ ఎన్నికలు : నితీష్‌కుమార్

పాట్నా : 2024 లోక్‌సభ ఎన్నికలు ఏ సమయంలోనైనా ముందస్తుగానే జరగవచ్చని బిహార్ ముఖ్యమంత్రి, జెడియు నితీష్‌కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ఐక్యత నేపథ్యంలో తమకు మరింత నష్టం జరుగుతుందని బిజెపి భయపడుతోందని.. అందువల్ల ముందుగానే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. నలంద ఓపెన్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార ఎన్‌డిఎ ముందస్తుగానే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని ఏడెనిమిది నెలల నుంచే చెబుతున్నానన్నారు. బిజెపిని ఓడించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు కచ్చితంగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడం వెనుక తనకు ఎలాంటి పదవీకాంక్షలేదని మరోసారి స్పష్టంచేస్తున్నానన్నారు. ఎన్నికలకు ముందు సాధ్యమైనన్ని పార్టీలను బిజెపికి వ్యతిరేకంగా ఏకం చేయడమే తన కోరిక అన్నారు. ఇండియా వేదికలోకి మరికొన్ని పార్టీలు రాబోతున్నాయంటూ ఇటీవల వ్యాఖ్యానించిన ఆయన ఆ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

అలాగే, రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పూర్తయిందన్న బీహార్ ముఖ్యమంత్రి త్వరలోనే వాటిని ప్రచురించనున్నట్టు వెల్లడించారు. వివరణాత్మక డేటా ప్రచురించాక, ఇతర రాష్ట్రాలు సైతం దీన్ని కచ్చితంగా అనుసరిస్తాయని తాను భావిస్తున్నట్టు చెప్పారు. కులాల వారీగా సర్వే చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్రంలో బిజెపి సహా అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా తీసుకున్నట్టు చెప్పారు.

జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉద్రిక్తత

- ఎస్‌ఎఫ్ఐ విద్యార్థుల ఆందోళన

కొల్‌కతా : తాత్కాలిక వైస్ ఛాన్సలర్ బుద్ధదేవ్ సాకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. దీంతో విశ్వవిద్యాలయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్యాంపస్‌లో ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా యూనివర్సిటీ అధికారులు సంబంధిత వ్యక్తులందరితోనూ చర్చించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ వీసీ సోమవారం పరిపాలనా భవనం నుండి బయటికి వెళుతుండగా ఎస్‌ఎఫ్ఐకి చెందిన ఆర్ట్స్ ఫ్యాకల్టీ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులు ఆయన్ని అడ్డుకొని తమ డిమాండ్‌ను వినిపించారు. అందరితోనూ సమావేశం జరపడానికి కొంత సమయం పడుతుందని విద్యార్థులకు చెప్పానని ఆ తర్వాత వీసీ తెలిపారు.

సీనియర్ విద్యార్థుల వేధింపులు భరించలేక ఈ నెల 9న హాస్టల్‌లోని రెండో అంతస్తు బాల్కనీ నుండి అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనను నిరసిస్తూ విద్యార్థులు పరిపాలనా భవనం ఎదుట రెండు వారాలుగా నిరసన నిర్వహిస్తున్నారు.



మీకోసం

పన్నీరు ముక్కలను కాసేపు వేడి నీటిలో ఉంచి తీస్తే మెత్తగా అవుతాయి.

జీవన సౌరభం

అసమర్థులకు అవరోధాలుగా కనిపించేవి సమర్థులకు అవకాశాలుగా కనిపిస్తాయి.

అచ్చులలో తెలుగు

అమ్మ ప్రేమ మాధుర్యమే తెలుగు
ఆకాశమంత ఆనందం తెలుగు
ఇలలో విరిసిన ఇంద్రధనస్సు తెలుగు
ఈడేరిన మధుర కల మన తెలుగు

ఉరికే జలపాతం తెలుగు
ఊయల పాట తెలుగు
ఋతువుల గమనం తెలుగు
ఎలుగెత్తి పాడే పాట తెలుగు
ఏరువాక జానపదం తెలుగు
ఐరావతమై వరాలు కురిపించు తెలుగు

ఒగ్గు పాటల స్వరమే తెలుగు
ఓరుగల్లు పౌరుషం తెలుగు
ఔదార్యముతో మెలుగు తెలుగు
అందరి జీవనానికి వెలుగు తెలుగు




మొర్రి గోపి,
8897882202.

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలకు సరిపోయే యాపిల్స్ ఎదురుగా ఎక్కడ ఉన్నాయో జత చేయండి.

6
10
8
9
7



నేను గీసిన బొమ్మ



పి. స్పందన,
10వ తరగతి,
రాయిలాపూర్, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మధుమేహంపై అపోహలు వద్దు

మనిషి రక్తంలో చక్కెరస్థాయి ఎక్కువగా అనియంత్రిత స్థాయిలో ఉండటమే మధుమేహం (సుగర్). శరీరంలో ఇన్సులిన్ తగ్గడం వల్ల ఏర్పడే ఒకానొక అసమానత ఇది. సాధారణంగా రక్తంలో గ్లూకోస్ 100 మి.గ్రా ఉండాలి. దానికంటే ఎక్కువగా ఉంటే మధుమేహం ఉన్నట్లుగా భావించాలి. ఆహారం శరీరంలో జీర్ణంకాబడి గ్లూకోస్‌గా మారుతుంది. ఈ గ్లూకోస్ కణజాలంలోకి గ్రహింపలేకపోవడంతో రక్తంలో చక్కర స్థాయి ఎక్కువగా ఉంటుంది. గ్లూకోస్ కణాలలోకి గ్రహించబడాలంటే ఇన్సులిన్ అనే హార్మోను క్లోమగ్రంధి నుంచి స్రవించబడాలి. ఇన్సులిన్ తక్కువగా స్రవించినా, సరిపడా స్రవించకపోయినా రక్తంలోని గ్లూకోస్ కణాల్లోకి గ్రహించబడదు. వ్యాధిగ్రస్తులకు శరీరంలోని జీవకణాలకు దీర్ఘకాలం శక్తి అందక వివిధ అవయవాలు అనారోగ్యనికి గురౌతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్య స్థితి పట్ల అప్రమత్తులుగా ఉండి తగు జాగ్రత్తలు పాటిస్తే దీన్ని అదుపులో ఉంచుకోవచ్చు.

సమతుల ఆహారంతో అదుపు చేయొచ్చు

నిరంతర వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లను పాటిస్తే మధుమేహం వ్యాధిని నియంత్రించొచ్చు.డయాబెటిస్, మధుమేహం, షుగర్, చెక్కర వ్యాధి... ఇలా అనేక పేర్లతో పిలుస్తున్నారు. తమకు షుగర్ వచ్చినా చాలామందికి తెలియటం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మన దేశాన్ని ప్రపంచ మధుమేహ వ్యాధి రాజధానిగా అభివర్ణించింది. ప్రపంచంలో అత్యధికంగా షుగర్ వ్యాధిగ్రస్తులు భారతదేశంలోనే ఉన్నారు. షుగర్ వ్యాధి రెండు రకాలుగా ఉంటుంది. టైప్-1, టైప్-2 డయాబెటిస్, ఇప్పుడు టైప్-2 డయాబెటిస్ ఎక్కువగా ఉంది.

షుగర్ వ్యాధి లక్షణాలు ఇవీ..

పాస్‌క్రియాస్ గ్రంథిలో రాళ్లున్న వారు, గర్భిణులకు, స్థిరాయిడ్ ఎక్కువకాలం వాడిన వారికి ఈ వ్యాధి సంక్రమించొచ్చు.

వ్యాధి లక్షణాలు : విపరీతమైన దాహం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన, మసక మసకగా కనబడటం, ఎక్కువ ఆకలిగా ఉండటం, గాయాలు తేలికగా మానకపోవడం, నిస్సత్తువ బరువును కోల్పోవడం వంటివి.

దుష్పరిణామాలు : చక్కెర వ్యాధిని నియంత్రించడంలో లోపం జరిగితే అది శరీరంలోని అన్ని ముఖ్య అవయాలకు ఒక విషంలాగా పనిచేస్తుంది. తల నుండి పాదాల వరకు సమస్య ముఖ్య అవయాలకు శాశ్వతంగా కీడు చేస్తుంది.

కంట్రోల్ లేకుంటే : మూత్రపిండాలు, కళ్లు, నరాలు, గుండె రక్తనాళాలు, పాదాల్లో వచ్చే గాయాలు, దంతాలకు, పుట్టబోయే బిడ్డలకు హాని కల్గిస్తుంది.

షుగర్ వ్యాధి ఎలా వస్తుందంటే..

ప్రతిఒక్కరికీ తమ దైనందిన జీవితానికి శక్తి కావాలి. శరీరం, మనస్సు పని చేయాలంటే కొంత శక్తి ఖర్చు అవుతుంది. మనం తీసుకునే ఆహారం ద్వారా ఆ శక్తి తయారవుతుంది. మనం తినే ఆహారం జీర్ణమైన తరువాత చక్కెర లేదా గ్లూకోజ్‌గా మార్పు చెందుతుంది. శరీరంలో అన్ని కణాలకు ఈ గ్లూకోజ్ చేరితేనే వాటికి తద్వారా మనకు శక్తి వస్తుంది. వివిధ కణాలను చేరేందుకు ఈ గ్లూకోజ్ రక్త ప్రసరణలోకి చేరుతుంది. రక్తప్రసరణలోనికి చేరుకున్న గ్లూకోజ్ కణాల్లోకి ప్రవేశించి శక్తిని ఇవ్వడానికి ఇన్సులిన్ అనే హార్మోన్ అవసరమవుతుంది. ఈ ఇన్సులిన్ జఠరరసం ప్యాంక్రియాస్ అనే గ్రంధిలో ఉత్పత్తి అవుతుంది. ఈ ఇన్సులిన్ ఉంటేనే కణ ద్వారాలు తెరుచుకొని గ్లూకోజ్ కణంలోకి వెళ్లే వీలవుతుంది. ఇన్సులిన్ కణ ద్వారాలను తెరిచే తాళం చెవి లాంటిదన్నమాట. తగినంత ఇన్సులిన్ లేకపోతే గ్లూకోజ్ కణాల్లోకి ప్రవేశించలేక రక్త ప్రసరణలోనే అధిక మొత్తం గ్లూకోజ్ ఉండిపోతుంది. ఇలా రక్తంలో చక్కెర ఎక్కువైతే చక్కెర వ్యాధి వస్తుంది. పెద్ద మోతాదులో రక్తంలో చక్కెర స్థాయి పెరిగిపోతూ శరీర కణాలు ఉపయోగించుకోలేని చక్కెర మూత్రంతో కలిసి బయటకు వెళ్తుంది.





వేగంగా వ్యాధి విస్తరణ ఇలా..

1970లో 50 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే వచ్చే షుగర్ వ్యాధి ఇప్పుడు 30, 40 ఏళ్ల మధ్య ఉన్న వారికి ఎక్కువగా వస్తుంది. వ్యాధి పీడితుడు శక్తి సామర్థ్యాలు తగ్గి ఆర్థిక, ఆరోగ్య సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దేశంలో 1990 నుంచి ఏటేటా షుగర్ వ్యాధి బాధితులు విపరీతంగా పెరుగుతున్నారు. షుగర్ వ్యాధి రావడానికి అనుకూలమైన ప్రదేశాన్ని మనుషులే సృష్టిస్తున్నారు. శుభకార్యాల్లోనూ, పుట్టిన రోజుల్లో, పర్వదినాల్లోనూ, శుభాకాంక్షలు తెలిపే సమయాల్లోనూ విపరీతమైన ఖర్చు చేసి స్వీట్లు, కూల్ డ్రింక్లు సేవిస్తున్నారు. దీంతో ఈ వ్యాధి వేగంగా వస్తుంది. ఇలాంటి సమయాల్లో పండ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు వంటివి తీసుకుంటే మంచిది. వీటి ద్వారా షుగర్ వ్యాధి రాదు. పెళ్లిళ్ల చేసేటప్పుడు అతిథులకు బాగా మర్యాద చేయాలనే తపనలో అధికంగా వంటకాలతో భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఆ భోజనాలు చేయడంతో షుగర్, బిపి, గుండెపోటు, పక్షవాతం వంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవు తున్నాయి. సంప్రదాయబద్ధంగా ఉండే పండ్లు, కాయగూరలతోనే భోజనం చేయడం మంచిది.

మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం..

షుగర్ వచ్చింది కదా అని నిరుత్సాహ పడాల్సిన పని లేదు. జాగ్రత్త పడి ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆరోగ్యవంతంగా జీవిస్తారు. ప్రధానంగా పాలిష్ పట్టిన బియ్యం తినకూడదు. ముడి బియ్యం తినాలి. పీచుతో ఉన్న గోధుమపిండిని వాడాలి. కొవ్వు ఎక్కువగా ఉన్న తీపి పదార్థాలను తినరాదు. సంప్రదాయబద్ధమైన స్వీట్లు అంటే బూరెలు తదితరాలు తినాలి. మొలకెత్తిన గింజలను ఆహారంగా తీసుకోవాలి. శారీరక శ్రమ ఎక్కువగా చేయాలి. స్థూలకాయాన్ని నివారించాలి. పప్పు, పులుసు, ఇగురు కూరలు తీసుకోవాలి ఉప్పు, నూనె వాడకాన్ని బాగా తగ్గించాలి.

శారీరక శ్రమ ఉత్తమమార్గం..

శారీరక శ్రమను నిత్య జీవితంలో ఒక భాగం చేయాలి. అవకాశమున్నప్పుడు సైకిల్ తొక్కేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ ఎవరి పనులు వారే చేసుకోవాలి. టీవీ చూసేటప్పుడు రిమోట్ సంస్కృతి విడనాడాలి. ప్రతి రోజూ వ్యాయామంలో మొదట యోగా ఉత్తమమైనది. తర్వాత సైకిల్ తొక్కడం, ఈత, డ్రిల్లు, నడక తదితరాలు వీలును బట్టి చేస్తే మంచిది. అవకాశమున్న వారు ఇంట్లో మొక్కలు, కాయగూరలు పెంపకం చేపట్టాలి. దీంతో శారీరక శ్రమ లభించడంతో పాటు మంచి కూరగాయల్ని తినొచ్చు.

- డాక్టర్ బి.అనిల్ కుమార్
షుగర్ వ్యాధి వైద్య నిపుణులు,
ప్రభుత్వ ఏరియా వైద్యశాల,
యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా.



చెస్ ఆణిముత్యం ప్రజ్ఞానంద

తల్లిదండ్రుల ప్రోత్సాహమూ మరువలేనిది

చెన్నైకి చెందిన 18ఏళ్ల రమేశ్‌బాబు ప్రజ్ఞానంద అజర్‌బైజాన్‌లోని బాకు వేదికగా జరిగిన ప్రపంచకప్ చెస్ రన్నరప్‌గా నిలిచి ఔరా అనిపించుకున్నాడు. ఫైనల్ టై బ్రేక్‌లో టాప్‌సీడ్ కార్ల్‌సన్ చేతిలో పోరాడి ఓడిన ప్రజ్ఞానంద.. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరిన రెండో భారత గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రజ్ఞానంద చెస్‌లో రాణించ డం ఒక ఎత్తయితే.. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరో ఎత్తు. చంద్రయాన్-3 రాకెట్ చంద్రునిపై అడుగిడిన రోజే ప్రజ్ఞానంద పేరూ విశ్వవ్యాప్తమైంది. ప్రజ్ఞానంద ముద్దుపేరు ప్రాగ్. ఆరేళ్లకే అండర్-7 ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచి ఆ తర్వాత అండర్-8, అండర్-10 ప్రపంచ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్స్ గెలుచుకుం టూ వచ్చాడు. 10ఏళ్ల 9నెలల వయసులో 2016 లో ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన అంతర్జా తీయ మాస్టర్(ఐఎం) ఘన తను అందుకున్నాడు. 2018లో 12ఏళ్ల 10నెలల వయసులో రష్యాకు చెందిన సెర్గీ కర్జాకిన్ తర్వాత గ్రాండ్‌మాస్టర్ హోదాను సాధించిన రెండో అతి పిన్న వయస్కు డుగా, భారత తొలి గ్రాండ్‌మాస్టర్‌గా ప్రజ్ఞానంద రికార్డు నెలకొల్పాడు. తాజాగా ప్రపంచకప్ చెస్ రన్నరప్‌గా నిలిచి తొలి అతి పిన్న వయస్కుడిగా చెస్ చరిత్రలో సుస్థిర స్థానం లిఖించుకున్నాడు.

ఆశ వదులుకోని కుటుంబ సభ్యులు..

తండ్రి రమేశ్‌బాబు పోలియో బాధితుడు కావడంతో తల్లి నాగలక్ష్మి, సోదరి వైశాలి కలిసి ప్రజ్ఞానంద ఆడే ప్రతి టోర్నమెంట్‌కూ తప్పనిసరిగా వెళ్లేవారు. నాగలక్ష్మి పిల్లలకు వంట మనిషిలా సపర్యలు చేస్తుండేది. మరోవైపు తండ్రి రమేశ్ బాబు డబ్బు సమకూర్చేందుకు ఎన్నో కష్టాలను పడాల్సి వచ్చింది. దేశీయ టోర్నీలైతే ఫర్వాలేదు గానీ.. విదేశీ పర్యటనలకు లక్షలాది రూపాయలు ఖర్చయ్యేది. అది తండ్రికి తలకుమించిన భారంగా మారింది. రమేశ్‌బాబుది ఓ మధ్యతరగతి కుటుంబం. ఒకచేతి సంపాదనే! ప్రజ్ఞానంద పాల్గొనే ప్రతి విదేశీ టోర్నమెంట్‌లోనూ నాగలక్ష్మి తప్పనిసరిగా వెళ్లాల్సి రావడంతో ఆర్థికభారం రెట్టింపయ్యాయి.



సోదరి వైశాలి, తండ్రి రమేశ్‌బాబు, తల్లి నాగలక్ష్మితో ప్రజ్ఞానంద

ప్రపంచకప్ చెస్ పోటీలకు తల్లి నాగలక్ష్మి, సోదరి వైశాలి కూడా వెళ్లారు. రన్నరప్‌గా నిలిచిన కొడుకును ప్రేమగా ఓదారుస్తున్న ఫొటో మరుసటి రోజు మీడియాలో చూసే వరకు ఆమెకు ఈ విషయమే తెలియదు. ప్రాగ్ సాధించిన ఘనత కంటే నాగలక్ష్మి చేసే సేవలపైనే మీడియా ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఆ విషయాలను ప్రజ్ఞానంద సోదరి వైశాలి వివరిస్తూ.. చాలామంది మా అమ్మ గురించి మాట్లాడుకోవడం విని గర్వపడ్డాను. ఎందుకంటే ప్రతి టోర్నమెంట్‌కు పిల్లలతో కలిసి తల్లిదండ్రులు వెళ్లడం పరిపాటి. కానీ వంట చేసి పిల్లలకు తినిపించడమనేది ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవాల్సిన అంశం. ఇక మా నాన్నగారు మేము వెళ్లే ప్రతి టోర్నమెంట్‌కు విమాన టికెట్లు సమకూర్చడం, హోటల్ రూమ్‌లను బుక్ చేయడంలో సాయపడే వారు. దీంతో ప్రాగ్ ఎక్కువగా చెస్‌పై దృష్టి పెట్టడానికి వీలుపడేదని ఆమె చెప్పుకొచ్చింది. మా తల్లిదండ్రులు ఏనాడూ పతకాలు, ట్రోఫీలు సాధించమని ఒత్తిడి చేయలేదని, ఏదో ఒకరోజు తప్పక గెలుస్తారని ప్రోత్సహించేవారని ఆమె తెలిపింది.

ప్రజ్ఞానంద కంటే నాలుగేళ్లు పెద్దదైన సోదరి వైశాలి కూడా చెస్ క్రీడాకారిణే. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని చూసి ఆమె చాలా బాధపడేది. తల్లిదండ్రులకు ఇబ్బంది కలగ కూడదనే ఉద్దేశంతో విదేశీ టోర్నమెంట్‌లలో ప్రాతినిధ్యం తగ్గించింది. కానీ దేశీయ టోర్నమెంట్‌లలో ప్రతి ఒక్కదాని లోనూ ప్రాతినిధ్యం వహించేది. తల్లిదండ్రులు పడ్డ కష్టానికి ప్రజ్ఞానంద ఈ సాధించిన విజయమే నిదర్శనం. ఇక ప్రజ్ఞానంద గ్రాండ్ మాస్టర్ హోదా సాధించాక స్పాన్సర్స్ ముందుకు రావడంతో రమేశ్‌బాబుకు కొంత ఉపశమనం కలిగింది.

- స్పోర్ట్స్ డెస్క్

జకోవిచ్ శుభారంభం

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ శుభారంభం చేశాడు. సోమవారం రాత్రి జరిగిన తొలిరౌండ్ పోటీలో జకోవిచ్ 6-0, 6-2, 6-3తో అలెగ్జాండర్ ముల్లర్ (ఆస్ట్రేలియా)పై వరుససెట్లలో నెగ్గాడు. తొలి సెట్‌ను ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా కేవలం 23 నిమిషాల్లోనే చేజిక్కించు కున్నాడు. అలాగే యుఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో తొలిరౌండ్ పోటీలో నెగ్గి 17-0 ఆధిక్యతలో నిలిచాడు. అలాగే ఈ విజయం తో ఏటిపి ర్యాంకింగ్స్‌లో 390వ వారాల పాటు అగ్రస్థానంలో ఉన్న రికార్డును నెలకొ ల్పాడు. కెరీర్‌లో ఇప్పటివరకు 23గ్రాండ్ స్లామ్ టైటిళ్లు నెగ్గిన జకోవిచ్ మరో టైటిల్‌ను చేజిక్కించుకుంటే అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన మార్గరేట్‌ను రికార్డును సమం చేయనున్నాడు. ఇతర పోటీల్లో 7వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 6-2, 6-3, 6-4తో రోనిక్(కెనడా)పై, 9వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా) 6-2, 6-1, 6-2తో సహచర ఆటగాడు జాన్సన్‌పై నెగ్గి రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు. 3వ సీడ్ డానియేల్ మెద్వదెవ్(రష్యా) 6-1, 6-1, 6-2తో బలజెక్స్(హంగేరీ)పై విజయం సాధించాడు.

ఇక మహిళల సింగిల్స్‌లో అమెరికా టీనేజర్ కోకా గాఫ్ చెమటోడ్చి రెండోరౌండ్‌కు చేరింది.



తొలిరౌండ్‌లో 6వ సీడ్ గాఫ్ 3-6, 6-2, 6-4తో జర్మనీకి చెందిన సెజ్‌మౌండ్‌పై నెగ్గింది. ఇతర పోటీల్లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్) 6-0, 6-1తో పెటెర్సన్(స్వీడన్)పై గెలుపొందగా.. 4వ సీడ్ రైబకినా(కజకిస్తాన్) 6-2, 6-1తో కోస్ట్యుక్(ఉక్రెయిన్)పై గెలిచారు. 5వ సీడ్ జబీర్(ట్యునీషియా) 7-5, 7-6(7-4)తో ఒసోరి యో(ఉక్రెయిన్)పై గెలిచి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు.

ఆసియాకప్ క్రికెట్ సంగ్రామం నేటినుంచే..

పాక్-నేపాల్ మ్యాచ్‌తో షురూ.. ● మ. 3.00గం॥ల నుంచి

లాహోర్: ఆసియాకప్ క్రికెట్ సంగ్రామం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. పాకిస్తాన్, నేపాల్‌జట్ల మధ్య ముల్తాన్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో 2023 ఆసియాకప్ క్రికెట్ టోర్నీ తెర లేవనుంది. పాకిస్తాన్ వేదికగా జరగాల్సిన ఈ టోర్నీ భద్రతా కారణాలవల్ల భారతజట్టు పాక్‌లో పర్యటించేం దుకు నిరాకరించడంతో శ్రీలంక, పాకిస్తాన్ కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. డిఫెండింగ్ ఛాంపి యన్ హోదాలో శ్రీలంక జట్టు బరిలో దిగుతోంది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే మొత్తం ఆరుజట్లను రెండు గ్రూపులుగా విభజించారు. భారత్ ఉన్న గ్రూప్-ఏలో పాకిస్తాన్, నేపాల్ జట్లు ఉన్నాయి. గ్రూప్-బి లో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు ఉన్నాయి. గ్రూప్ లీగ్ పోటీలు ముగిసిన అనంతరం ఆ గ్రూప్ టాప్-2లో ఉన్న రెండు జట్లు సూపర్-4కు చేరనున్నాయి. సూపర్-4 లో ఒక్కో జట్టు మూడేసి మ్యాచ్‌లు ఆడతాయి. టాప్-2లో ఉన్న రెండుజట్ల మధ్య టైటిల్‌పోటీ జరగనుంది.

కెఎల్ రాహుల్ దూరం

ఆసియా కప్‌కు ముందు భారత జట్టుకు షాక్ తగిలింది. ఓపెనర్ కేఎల్ రాహుల్.. భారత్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. భారత జట్టు సెప్టెంబర్ 2న పాకిస్తాన్‌తో, 4న నేపాల్‌తో రెండో మ్యాచ్ ఆడనుంది. కేఎల్ రాహుల్ తొలి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదనే

ఆసియాకప్ 2023 షెడ్యూల్..

30(బుధ)	: పాకిస్తాన్ × నేపాల్
31(గురు)	: బంగ్లాదేశ్ × శ్రీలంక
సెప్టెంబర్ 2(శని)	: పాకిస్తాన్ × భారత్
2(ఆది)	: బంగ్లాదేశ్ × ఆఫ్ఘనిస్తాన్
4(సోమ)	: భారత్ × నేపాల్
5(మంగళ)	: ఆఫ్ఘనిస్తాన్ × శ్రీలంక
సూపర్-4 మ్యాచ్‌లు..	
6(బుధ)	: ఎ1 × బి2
9(శని)	: బి1 × బి2
10(ఆది)	: ఎ1 × ఎ2
12(మంగళ)	: ఎ2 × బి1
14(గురు)	: ఎ1 × బి1
15(శుక్ర)	: ఎ2 × బి2
17(ఆది)	: ఫైనల్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68